www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -303 ఆదివారం 8 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# అభివృద్ధి చేస్తున్నాం..

# ఇంకా చేసి చూపిస్తాం

**మున్సిపల్ ఎన్నికల్లో విజయం మాదే -మరో మూడేళ్లు అధికారంలో ఉండేది మేమే**

**వికారాబాద్, పరిగి, తాండూర్‌లకు గోదావరి నీళ్లు పారిస్తాం**

**కేసీఆర్ కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలేశ్వరంగా మారింది**

**బిజెపి, బిఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలను తిప్పికొట్టండి**

**వికారాబాద్ జిల్లా పర్యటనలో సిఎం రేవంత్ పిలుపు**




**హైదరాబాద్,ఫిబ్రవరి 7ప్రజావినికిడి,**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచేది మళ్లీ కాంగ్రెస్ పార్టీయేనని సిఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మీరిచ్చిన అధికారంతో అభివృద్ధి పనులు చేస్తున్నామని అంటూ..వికారాబాద్, తండూర్, పరిగి ప్రాంతాలకు గోదావరి జలాలను తరలిస్తామని అన్నారు. ఇందుకు మంత్రి శ్రీధర్ బాబే సాక్ష్యం అంటూ హామీ ఇచ్చారు. వికారాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నారాయణపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతిబాట బహిరంగ సభ పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంజూరైన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కేసీఆర్ తన స్వార్థం కోసం అటకెక్కించారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లాకు 3 టీఎంసీల గోదావరి జలాలను అందిస్తే లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చేవేనని, కానీ కేసీఆర్ నిర్లక్ష్యం వల్ల జిల్లా రైతాంగం బలైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ లక్ష కోట్లు వెచ్చించి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం మూడు ఏళ్లలోనే 'కూలేశ్వరం'గా మారిందని, ఆ ప్రాజెక్టు నిధులతో ఆయనమిగతా 2లో...

## మలేసియాలో త్వరలో

# కొత్త కాన్సులేట్

**కౌలాలంపూర్‌లో ప్రధాని మోడీ ప్రకటన**

**ఘనంగా స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు**




**కౌలాలంపూర్,,ఫిబ్రవరి 7ప్రజావినికిడి,**

మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్ ఏర్పాటు చేయనున్నట్టు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. రెండ్రోజుల మలేసియా పర్యటన నిమత్తం శనివారంనాడు కౌలాలంపూర్ చేరుకున్న ఆయనకు మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం సాదర స్వాగతం పలికారు. భారతీయ సంప్రదాయ నృత్యాలతో ప్రవాస భారతీయులు ఆహ్వానం పలికారు. అనంతరం కౌలాలంపూర్ లోని భారత సంతతి ప్రజలతో ఆత్మీయ సమ్మేళనంలో మోదీ పాల్గొన్నారు. భారత్ పదేళ్లలో వేగంగామిగతా 2లో...

# ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి



**పోచారం వద్ద వేగంగా దూసుకొచ్చిన కారు**

**ఓఆర్ఆర్ రోడ్డు నుంచి సర్వీసు రోడ్డు పైకి ఎగిరిపడిన కారు**

**గాయపడిన వారిని ఆసుపత్రికి తరలింపు**

**,ఫిబ్రవరి 7ప్రజావినికిడి,**

సంగారెడ్డి జిల్లాలోని పోచారం వద్ద ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన కారు ఓఆర్ఆర్ నుంచి సర్వీసు రోడ్డు పైకి ఎగిరి పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న మౌనిక (36), నవీన్ (30) అక్కడికక్కడే మృతి చెందగా,మిగతా 2లో...

# దర్యాప్తుకు తప్పనిసరి అని భావించినపుడే 'అరెస్ట్' చేయాలి

**పోలీసులకు సుప్రీం కీలక ఆదేశాలు**

**ప్రశ్నించాలనే కారణంతో అరెస్ట్ చేస్తానంటే కుదరదని హెచ్చరిక**

**ఏడేళ్లలోపు శిక్ష పడే కేసుల్లో ఇష్టారీతిన అరెస్టులు సరికాదని వ్యాఖ్య**

న్యూఢిల్లీ,**ఫిబ్రవరి 7ప్రజావినికిడి,**

కేసు విచారణలో భాగంగా ఎవరినైనా ప్రశ్నించేందుకు అరెస్టు చేయడం సరికాదని దేశ అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ముఖ్యంగా ఏడేళ్ల లోపు శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల్లో ఎడాపెడా అరెస్టులు కుదరవని స్పష్టం చేసింది.మిగతా 2లో...



## హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో

# భారీ అగ్నిప్రమాదం


**కంప్యూటర్లు, ఫైల్స్ దగ్ధం**

**పలు కీలక కేసుల ఆధారాలు ల్యాబ్‌లోనే..**

**ఫోన్ ట్యాపింగ్, ఓటుకు నోటు, ఎమ్మెల్యేల కొనుగోలు కేసుల డేటా ఇక్కడే !**

**మెహిదీపట్నం,ఫిబ్రవరి 7ప్రజావినికిడి,**

హైదరాబాద్ నాంపల్లిలోని స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్-ఎల్)లో శనివారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ల్యాబ్‌లోని మొదటి అంతస్తులో ఉన్న కంప్యూటర్ మిగతా 2లో...




## శ్రీశైలంలో 8 నుంచి 18 వరకు

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



శ్రీశైలం,**ఫిబ్రవరి 7ప్రజావినికిడి,**

నంద్యాల జిల్లా శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఫిబ్రవరి 8 నుంచి 18వ తేదీ వరకు 11 రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు ప్రకటించారుమిగతా 2లో...

# హామీలెక్కడ?

**పోచారం కాంగ్రెస్‌లోకి ఎందుకెళ్లారు**

**ప్రజలంతా ఆయనను నిలదీయాల్సిందే**

**గతంలో తిట్టిన కాంగ్రెస్ పంచన చేరిన పోచారం**

**అమలుకాని హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస**

**బాన్సువాడ కార్నర్ మీటింగ్‌లో కెటిఆర్ విమర్శలు**



కామారెడ్డి,,**ఫిబ్రవరి 7ప్రజావినికిడి,**

కాంగ్రెస్ పార్టీలోకి పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎందుకు పోయారో బాన్సువాడ ప్రజలకు సమాధానం చెప్పవలసిన అవసరం ఉందని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో స్వర్ణయుగం నడిచిందనిమిగతా 2లో...

# ఎన్నాళ్లు కేంద్రాన్ని తిడుతూ పాలిస్తారు

**కెసిఆర్‌పై చర్యలు తీసుకుంటే అడ్డుకున్నదెవరు**

**రేవంత్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి**

హైదరాబాద్,,**ఫిబ్రవరి 7ప్రజావినికిడి,**

మాజీ సీఎం కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటామంటే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎవరు అడ్డుకున్నారో చెప్పాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చర్యలు తీసుకోవాల్సింది సీఎం కాదా అని ప్రశ్నించారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రికి చేతగాక.. బాధ్యతారాహిత్యంగామిగతా 2లో...



# ఇకపై 18 శాతం పన్ను

**అదనపు టారిఫ్ లను తగ్గించిన ట్రంప్..**

**ట్రేడ్ డీల్ నేపథ్యంలో శుక్రవారం అమెరికా అధ్యక్షుడి ప్రకటన**

**రష్యా చమురు దిగుమతుల నిలిపివేతకు భారత్ కట్టుబడి ఉందని వెల్లడి**

**25 శాతం ప్రతీకార సుంకాలను తగ్గిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ పై సంతకం**




ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# అభివృద్ధి ఇంకా చేసి చూపిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబ సభ్యులు ఫామ్ హౌసులు కట్టుకుని వ్యాపారాలు చేసుకున్నారని ఆరోపించారు. తాండూరు, పరిగి , వికారాబాద్ ప్రాంతాలను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.స్వయం సహాయక సంఘాల మహిళలకు సీఎం రేవంత్ రెడ్డి ఇందిరా మహిళా శక్తి చెక్కుల పంపిణీ చేశారు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను, తప్పులను సరిదిద్దుకుంటూ తమ ప్రభుత్వం రాష్ట్ర ప్రగతి కోసం ముందుకు వెళుతోందని ఆయన స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్, కేంద్రంలో పన్నెండేళ్లుగా ఉన్న మోదీ రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించిన ఆయన, బీజేపీ , బీఆర్ఎస్ పార్టీల మధ్య 'చీకటి ఒప్పందాలు' ఉన్నాయని సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ కార్యకర్తలు తమ బీ-ఫామ్‌లను బీఆర్ఎస్ ఆఫీసుల నుండి తెచ్చుకుంటున్నారని ఎద్దేవా చేస్తూ, గల్లీలో పనిచేసే నాయకుడిని చూసి కాకుండా ఢిల్లీలో ఉండే పెళ్లి పెద్దను చూసి ఓట్లు వేయడం ఏమిటని ప్రజలను ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి పలు కీలక ప్రకటనలు చేశారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ భూసేకరణను త్వరలోనే పూర్తి చేసి, ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. మక్తల్, నారాయణపేట , కొడంగల్ నియోజకవర్గాలకు కృష్ణా జలాలను తరలించి 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పా జంక్షన్ నుండి మన్నెగూడ రోడ్డు పూర్తి కాకపోవడం వల్ల జరిగిన ప్రాణనష్టానికి కేసీఆర్, సబితా ఇంద్రారెడ్డిలే బాధ్యులని విమర్శించిన రేవంత్ రెడ్డి, ప్రస్తుతం కోర్టు కేసులను



పరిష్కరించి ఆ రోడ్డు పనులను వేగవంతం చేశామని వెల్లడించారు. భవిష్యత్తులో రీజనల్ రింగ్ రోడ్డు , రేడియల్ రోడ్లు రాబోతున్నాయని, వికారాబాద్ త్వరలోనే ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ చరిత్రను తాను చెరిపేయాలని చూస్తున్నానని కేటీఆర్, హరీశ్ రావు చేస్తున్న విమర్శలకు ముఖ్యమంత్రి ఘాటుగా స్పందించారు. కేసీఆర్ దొంగ పాస్‌పోర్టుల చరిత్ర, దొంగ నోట్ల వ్యవహారం , దళితుడిని సీఎం చేస్తానన్న దొంగ హామీల చరిత్ర తెలంగాణ ఉన్నంత కాలం చెరిగిపోదని, ఆ 'పాపాల భైరవుడి' చరిత్ర ప్రజలకు గుర్తుండేలా చేసే బాధ్యత తనదని ఆయన వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ లాంటి చిల్లర పనులకు నోటీసులు ఇవ్వక ఏం చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే 70 వేల ఉద్యోగాల భర్తీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ వంటి హామీలను అమలు చేశామని గుర్తు చేస్తూ, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో విషం చిమ్మే పాములకు మళ్ళీ పాలు పోయకుండా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రెండేళ్ల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రెండేళ్ల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నాం. అప్పులున్నా.. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. ఎన్నికల్లో నిలబడి కొట్లాడాలి కానీ, చీకటి ఒప్పందాలు చేసుకొని ఫెవికాల్ బంధంతో భాజపా, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్‌ను ఓడించాలని కుట్రలు చేస్తున్నాయి. బీఆర్ఎస్‌ను ప్రజలు బొందపెట్టారు. కాంగ్రెస్‌తో పోరాడటం మావల్ల కాదని భాజపాతో బీఆర్ఎస్ కలిసిపోయింది. భాజపా అభ్యర్థుల బీఫామ్‌లు బీఆర్ఎస్ పార్టీలో ఇచ్చే దుస్థితి ఏర్పడింది. స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు బీఆర్ఎస్, భాజపా ప్రయత్నించలేదు. ప్రధాని మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. పదేళ్లలో సమస్యలు పరిష్కరించి ఉంటే బీఆర్ఎస్, భాజపా నేతలు వంగి వంగి దండాలు పెట్టాల్సిన పరిస్థితి ఉండేది కాదు. అడగకుండానే ప్రజలు ఓటేసేవారు. ఓట్లు కావాలి కానీ, ప్రజల సమస్యలను ఏనాడైనా పట్టించుకున్నారా? ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు కోసం రూ.38వేల కోట్లతో నాటి సీఎం రాజశేఖర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. కేసీఆర్ సీఎం అయ్యాక రంగారెడ్డి జిల్లాలోని ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారు. తెలంగాణ ఉద్యమ నాయకుడినని చెప్పుకొని కేసీఆర్.. రంగారెడ్డి జిల్లాలకు గోదావరి జలాలను ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. గోదావరి జలాలను తీసుకొచ్చి తాండూరు, పరిగి, వికారాబాద్, చేవెళ్ల ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే బాధ్యత మాది అని సీఎం హామీ ఇచ్చారు. కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, కల్లకుంట్ల కిషన్ రావు గుర్తు పెట్టుకోండి తెలంగాణలో మళ్లీ గెలిచేది కాంగ్రెస్సేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భారీ గ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ల్యాబ్‌లో తొలుత మంటలు చెలరేగి నిమిషాల వ్యవధిలోనే ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి. ప్రమాదాన్ని గమనించిన కార్యాలయ సిబ్బంది బయటకు పరుగులు తీసింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని 5 ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. అగ్నిప్రమాదం కారణంగా ఆ ప్రాంతమంతా దట్టంగా నల్లటి పొగ అలుముకుంది. ఈ ప్రమాదంలో లోపల ఉన్న కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయని తెలిసింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కాగా, ప్రమాదం గురించి తెలియగానే నార్త్ జోన్ డీఐజీ శ్వేత, ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి ల్యాబ్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ల్యాబ్‌లో కీలకమైన కేసులు, ఫోరెన్సిక్ ఆధారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు ఏవైనా దెబ్బతిన్నాయా? అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు.

**ఏ వస్తువులు దగ్ధమయ్యాయో నిర్ధారణ కాలేదు : డీసీపీ శిల్పవల్లి**

ల్యాబ్‌లో అగ్ని ప్రమాదంతో ఏ ఏ వస్తువులు దగ్ధమయ్యాయన్నది ఇంకా పూర్తిగా నిర్ధారణ కాలేదని




ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. నేర పరిశోధనకు సంబంధించిన ఫైళ్లు, ఆధారాలు భద్రపరిచే ఎవిడెన్స్ లాబరేటరీ కార్యకలాపాలు ఈ భవనం నుంచే నిర్వహిస్తారని తెలిపారు. ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పనిచేస్తున్న వార్డు బాయ్ కృష్ణ మంటలను ఆర్పే ప్రయత్నంలో అపస్మారక స్థితిలోకి వెళ్లగా, అతడిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించామని చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో ల్యాబ్‌లో నలుగురు ఉద్యోగులు ఉన్నారని, మంటలను గమనించిన వెంటనే వారు బయటకు వచ్చేశారని అన్నారు.

**కీలకమైన కేసుల ఆధారాలన్నీ ల్యాబ్‌లోనే..**

నాంపల్లిలో ఉన్న స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో భారీ అగ్నిప్రమాదం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రమాదంలో కీలకమైన ఆధారాలు అగ్నికి ఆహుతి అయ్యాయని తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పలు కీలక కేసులకు సంబంధించి ఆధారాలు కాలి బూడిదైనట్టు తెలుస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక రాజకీయ ప్రకంపనలు సృష్టించిన అనేక కేసులకు సంబంధించిన కీలక ఆధారాలు సైతం ఆ ల్యాబ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఫైల్స్ అన్నీ అగ్నికి ఆహుతైనట్టు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా స్వాధీనం చేసుకున్న హార్డ్ డిస్కులు, డిజిటల్ డేటా విశ్లేషణ ఇక్కడే జరుగుతున్నట్టు తెలుస్తోంది. వీటితోపాటు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసుకు సంబంధించిన ఆడియో, వీడియో రికార్డింగ్‌ల ఒరిజినల్ ఫైల్స్ ఇక్కడి కంప్యూటర్లలోనే నిక్షిప్తమై ఉన్నట్టు సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల ముందు రాజకీయంగా సంచలనం రేపిన ఎమ్మెల్యేల కొనుగోలు యత్నం కేసులో స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, వాటికి సంబంధించిన ఫోరెన్సిక్ రిపోర్టులు సైతం ఇక్కడే ఉన్నట్టు తెలుస్తోంది.

# హామీలెక్కడ?

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పేదల కోసం కేసీఆర్ అనేక పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. కానీ అడ్డగోలు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ పాల్గొన్నారు. ముందుగా కొయ్యగుట్టలో అమర వీరుల స్తూపం వద్ద కేటీఆర్ నివాళు లర్పించారు. కొయ్యగుట్ట నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్‌తో కలిసి ఆయన భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ పాల్గొన్నారు. కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడుతూ .. పోచారం శ్రీనివాస్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డిని నమ్మి గెలిపిస్తే ఏం చేశాడని ప్రశ్నించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆయన తనయులు దోచుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి గతంలో అన్న విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఒక ఆంబోతు, రెండు దున్నపోతు లంటూ విమర్శించలేదా అని ప్రశ్నించారు. అయినప్పటికీ వెళ్లి రేవంత్ రెడ్డి పక్కకు చేరాడని విమర్శించారు. ఈ సందర్భంగా గతంలో పోచారం శ్రీనివాస్ రెడ్డిని రేవంత్ రెడ్డి తిట్టిన తిట్లను ఫోన్‌లో పెట్టి ప్రజలకు వినిపించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బండ కట్టుకొని బాయిలో దుంకాలె అని మండిపడ్డారు. కాంగ్రెస్‌లోకి ఎందుకు వెళ్లారో పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని ఓటేసి గెలిపించిన పోచారం శ్రీనివాస్ రెడ్డిని గల్లా పట్టి అడగాలని సూచించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బాన్సువాడ సిగ్గు తీసిండని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని కేటీఆర్ అన్నారు. తామే బాన్సువాడను మున్సిపాలిటీ చేశామని గుర్తుచేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బాన్సువాడ నియోజకవర్గంలో 10వేల కోట్లతో అభివృద్ధి జరిగిందని వివరించారు. భవనాలు, ఆస్పత్రి, కులసంఘాల భవనాలకు రూ.500 కోట్లు ఇచ్చామని తెలిపారు.42వేల మందికి ఆసరా పెన్షన్లు, 70 వేల మందికి రైతుబంధు, 14వేల మందికి రైతుబీమా ఇచ్చామని పేర్కొన్నారు. 15 వేల మందికి కల్యాణ లక్ష్మీ, 30 వేల మందికి కేసీఆర్ కిట్లు అందించామని చెప్పారు. ఆ నిధులు అన్నీ కేసీఆర్ ఇచ్చిందని.. పోచారం పీకిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లోకి వెళ్లాక ఒక్క రూపాయి కూడా పోచారం తీసుకురాలేదని విమర్శించారు. కాంగ్రెస్ నేతల మాటలు నమ్మొద్దని సూచించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డికి కేసీఆర్ ఏం అన్యాయం చేశాడని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి వేసే ఎంగిలి మెతుకులకు పోచారం ఎగిరెగిరి పడ్డాడని విమర్శించారు. బాన్సువాడ ప్రజలు గులాబీ జెండా ఎగురాలని అనుకుంటున్నారని అన్నారు. పోచారం లాంటి దొంగలకు సద్దులు కట్టింది చాలని కాంగ్రెస్ నాయకులకు హితవు పలికారు. కాంగ్రెసోళ్లు బంగారం ఇచ్చేవాళ్లు కాదు.. మెడలో పుస్తెలతాడు ఎత్తుకెళ్లే బ్యాచ్ అని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు దండుపాళ్యం బ్యాచ్.. స్టువర్టుపురం దొంగలని ఎద్దేవా చేశారు. కొయ్యగుట్ట నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్‌తో కలిసి ఆయన భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చిందని.. వాటిలో ఒక్క హామీనైనా నెరవేర్చిందా అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో తులం బంగారం లేదు.. స్కూటీలు లేవు.. ఆరు గ్యారెంటీలు లేవని విమర్శించారు. రైతుబంధు లేదు.. రైతు భరోసా లేదని అన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని చెప్పి మోసం చేశారని అన్నారు. అసలు కాంగ్రెస్ చెప్పిన నాలుగు వేల పెన్షన్ ఎవరికైనా వస్తుందా అని ప్రశ్నించారు. ఫ్రీ బస్సు పేరుతో రేవంత్ రెడ్డి మహిళలను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ మనిషి కాదు అని అన్నారు. మోదీ, రేవంత్ రెడ్డి ఇద్దరూ తోడు దొంగలని ఆరోపించారు. రేవంత్, ప్రధాని మోదీ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌నే గెలిపించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.రేవంత్ రెడ్డి ఏనాటికైనా బీజేపీ మనిషే, ఆయన కప్పుకున్న ముసుగు తొలగించి చూడాలని కేటీఆర్ ప్రజలను కోరారు. రేవంత్ ఏనాటికీ కాంగ్రెస్ మనిషి కాలేదని, ఆయన ముందు నుంచి బీజేపీ మనిషి అని, రేవంత్ ముమ్మాటికి బడే భాయ్ తమ్ముడు అని కేటీఆర్ అన్నారు. అందుకే రాష్ట్రంలోని మైనారిటీలు, మత రాజకీయాలను వ్యతిరేకించే ప్రతి ఒక్కరూ రేవంత్ రెడ్డి కప్పుకున్న బీజేపీ ముసుగును తొలగించి చూడాలని, ఆయన లోపల ఉన్న బీజేపీ నాయకుడిని గుర్తించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# ఎన్నాళ్లు కేంద్రాన్ని తిడుతూ పాలిస్తారు

మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ తమకు అవసరం అని చెప్పుకోవాలి కానీ.. కిషన్ రెడ్డి మీదనో, కేంద్ర ప్రభుత్వం మీదనో నిందలు వేయొద్దని హితవు పలికారు. కిషన్‌రెడ్డిని అడ్డుపెట్టి సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కువ రోజులు తప్పించుకోలేరన్నారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని ఏ ఒక్క రోజైనా రాహుల్‌గాంధీ.. రేవంత్ రెడ్డిని ఆదేశించారా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌పై చర్యలకు రాహుల్ గాంధీ అడ్డుపడకుంటే తక్షణమే చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అడ్డుకోవడం కోసం సోనియా కుటుంబం, కేసీఆర్ కుటుంబం ఏకమయ్యాయని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బీఆర్ఎస్, కాంగ్రెస్.. ఎవరు అధికారంలో ఉంటే వారు మజ్లిస్‌ను ప్రసన్నం చేసుకుంటున్నారని ఆరోపించారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు ఈ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తమను విమర్శించే ముందు సీఎం రేవంత్ ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. రేవంత్ తనను కల్వకుంట్ల కిషన్ రావు అని విమర్శించారని.. తానెలా కల్వకుంట్ల కిషన్ రావు అవుతాను? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబాన్ని కాపాడాల్సిన అవసరం తనకు ఎందుకుంటుందని నిలదీశారు. పనికిరాని, పసలేని ఆరోపణలు చేయడం రేవంత్ రెడ్డికి బాగా అలవాటైందని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. రేవంత్ చెత్త విమర్శలకు తాను చాలాసార్లు కౌంటరిచ్చానని అన్నారు. మళ్లీ మళ్లీ ఆయన పిచ్చి ప్రేలాపనలు చేయొద్దని.. ఈ విషయాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కేంద్రంపై అనవసరంగా మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి నాడు ఇందిరాగాంధీని గెలిపిస్తే.. ఆ జిల్లా ప్రజలకు, తెలంగాణకు ఆమె ఏం చేశారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక దేశంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని కిషన్ రెడ్డి వివరించారు. తమ ఎంపీలకు మోదీ సమ ప్రాధాన్యం ఇస్తారని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత కేంద్రం తెలంగాణకు ఏం చేసిందో చెబుతామని తెలిపారు. ఈ ఎన్నికల ప్రచారానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వచ్చే అంశంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని కిషన్ రెడ్డి తెలిపారు.

## మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్

(మొదటి పేజీ తరువాయి)

సాధిస్తున్న ప్రగతిని ఈ సందర్భంగా మోదీ వివరిస్తూ, పదేళ్ల క్రితం 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారతదేశం ప్రస్తుతం మూడో స్థానానికి చేరిందన్నారు. ఇండియాలో చదువుకునే విద్యార్థులకు త్వరలోనే తిరువళ్లువర్ స్కాలర్‌షిప్‌లు ఇస్తామని చెప్పారు. యూకే, యూఏఈ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుందని, విశ్వాసం భారతదేశపు బలమైన కరెన్సీగా మారిందని పేర్కొన్నారు. ఇండియాను ఒక పెద్ద మార్కెట్‌గానే గతంలో చూసేవారని, ఇప్పుడు పెట్టుబడులు, వాణిజ్యానికి హబ్‌గా మారిందని మోదీ తెలిపారు. అభివృద్ధికి విశ్వసనీయమైన భాగస్వామిగా భారత్ నిలుస్తోందన్నారు. యూకే, యూఏఓ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, యూఎస్ఏ సహా అనేక దేశాలు ఇండియాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాయని చెప్పారు. మలేసియాను ప్రపంచం లోనే అతిపెద్ద భారతీయ ప్రవాస జనాభాను కలిగిన రెండో దేశంగా మోదీ పేర్కొన్నారు. భారత్-మలేసియా ప్రజల హృదయాలను కలుపుతూ, రెండు దేశాల మధ్య వారధిగా ప్రవాస భారతీయులు నిలుస్తున్నారని ప్రశంసించారు. ఆహారపు అలవాట్లు, భాషా పరంగా ఎన్నో ఇరుదేశాల ప్రజల మధ్య ఎన్నో సామీప్యాలు ఉన్నాయని అన్నారు. భారతీయ సంగీతం, చలనచిత్రాలకు మలేసియాలో ఎంతో ఆదరణ ఉన్నట్టు విన్నానని, ప్రధాని అన్వర్ ఇబ్రహీం కూడా బాగా పాడతారనే విషయం ఇక్కడి వారందిరికీ తెలిసిందేనని అన్నారు. భారత్‌కు తిరిగి వచ్చిన చాలామందికి ఈ విషయం తెలియదని, తాను గత పర్యటనలో ఆశ్చర్యానికి గురయ్యానని చెప్పారు. ఇండియాలోని పాపులర్ హిందీ గీతాలను అన్వర్ ఇబ్రహీం ఆలపిస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయని, లెజెండ్రీ ఎంజీఆర్ తమిళ పాటలను ఆయన బాగా ఇష్టపడతారని అన్నారు. దీనికి ముందు, భారత్‌కు చెందిన 800 మందికి పైగా నృత్యకారులు ప్రధానికి విమానాశ్రయం వద్ద స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్ట్ నుంచి మోదీ, అన్వర్ ఇబ్రహీం కలిసి ఒకే కారులో ప్రయాణించారు. భారత సంతతి ఆత్మీయ సమ్మేళనం వద్ద 'భారత్ మాతా కీ జై', 'మోదీ, మోదీ' అనే నినాదాలతో ఆయనకు సాదర స్వాగతం లభించింది.

## దర్యాప్తుకు తప్పనిసరి అని భావించినపుడే 'అరెస్ట్' చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కేవలం ప్రశ్నించాలనే కారణంతో అరెస్టు చేయడాన్ని తప్పుబట్టింది. దర్యాప్తులో భాగంగా తప్పనిసరి అని భావించినపుడు ముందస్తుగా నోటీసు జారీ చేశాక అరెస్టు చేయాలని పోలీసులకు సూచించింది.భారత న్యాయ సంహిత ప్రకారం నోటీసులు జారీ చేసినప్పటికి అరెస్టు తప్పనిసరి కాదని తేల్చిచెప్పింది. ఈ మేరకు సతేందర్ కుమార్ అంటిల్ వర్సెస్ సీబీఐ కేసులో జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్ కే సింగ్ ల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. వ్యక్తిగత స్వేచ్ఛతో కూడుకున్న విషయం కాబట్టి అరెస్టుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీసులకు సూచించింది.

**సుప్రీం బెంచ్ సూచనలు ఇవే..**

క్రిమినల్ కేసుల్లో ఫిర్యాదు అందిన తర్వాత రెండు దశల పద్ధతిని పాటించాలని దర్యాప్తు అధికారికి కోర్టు సూచించింది. సదరు కేసు విచారణలో అరెస్టు తప్పనిసరా? కాదా?.. బీఎన్ఎస్ సెక్షన్ 33, సెక్షన్ 35 ప్రకారం అరెస్టు చెయ్యవచ్చా? లేదా? అనేది వ్యక్తిగతంగా నిర్ణయించుకోవాలని పేర్కొంది. ఈ ప్రక్రియలో ఆర్టికల్ 21 (వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కు) ప్రకారం పౌరులకు కల్పించిన హక్కుల ఉల్లంఘన జరగకుండా జాగ్రత్తపడాలని హెచ్చరించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు అందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని; నిందితుడు, సహ నిందితుడనే భేదాలు ఏవీ మినహాయింపు కాదని స్పష్టం చేసింది. అదే సమయంలో అరెస్టుకు సంబంధించి పోలీసులకు చట్టం కల్పించిన మినహాయింపులనూ సుప్రీంకోర్టు ప్రస్తావించింది. బీఎన్ఎస్ సెక్షన్ 35(1)(బి) ప్రకారం.. ఎలాంటి వారెంట్ లేకున్నా పోలీసులు అరెస్టు చేయవచ్చునే నిబంధనను ప్రస్తావిస్తూ.. ఈ రూల్ ప్రకారం వారెంట్ లేకుండా ఎవరినైనా అరెస్టు చేయొచ్చని భావించరాదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది.

## ఇకపై 18 శాతం పన్ను

### అదనపు టారిఫ్ లను తగ్గించిన ట్రంప్..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ కు శుభవార్త చెప్పారు. ఇటీవల భారత్ పై విధించిన ప్రతీకార సుంకాల (25 శాతం) ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. రష్యా నుంచి చమురు దిగుమతులను ఆపేసే విషయంలో భారత్ కట్టుబడి ఉందని, దీంతో టారిఫ్ లను తగ్గిస్తున్నామని ట్రంప్ చెప్పారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ పై ఆయన శుక్రవారం సంతకం చేశారు. అమెరికా, భారత్ ల మధ్య ఇటీవల కుదిరిన ట్రేడ్ డీల్ లో భాగంగా 7 శాతం టారిఫ్ లను ట్రంప్ తగ్గించిన విషయం తెలిసిందే. తాజా ప్రకటనతో భారత్ పై అమెరికా పన్నుల భారం 18 శాతానికి తగ్గింది.రష్యా ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాలపై ట్రంప్ అప్పట్లో ప్రతీకార సుంకాలు విధించారు. ఆయా దేశాల నుంచి అగ్రరాజ్యానికి దిగుమతి అయ్యే వస్తుసేవలపై 25 శాతం పన్నులు విధించి అమలు చేశారు. ఈ జాబితాలో భారత్ కూడా ఉంది. దీనికితోడు భారత్ పై అదనపు సుంకాలు మరో 25 శాతం విధించారు.మొత్తంగా 50 శాతం టారిఫ్ లు విధించడంతో భారత ఎగుమతిదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఇటీవల కుదరిన ట్రేడ్ డీల్ తర్వాత అదనపు సుంకాలను 25 శాతం నుంచి 18 శాతానికి ట్రంప్ తగ్గించారు. దీంతో భారత్ పై ప్రతీకార సుంకాలు 25 శాతం, అదనపు సుంకాలను 18 శాతం అమెరికా అధికారులు వసూలు చేశారు. ట్రంప్ తాజా ప్రకటనతో ఇకపై భారత వస్తుసేవల మీద కేవలం 18 శాతం పన్నులు మాత్రమే వసూలు చేయనున్నారు.

## శ్రీశైలంలో 8 నుంచి 18 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

. (మొదటి పేజీ తరువాయి)

. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం సుమారు 30 శాతం మంది భక్తులు ఎక్కువగా శ్రీశైలం క్షేత్రానికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ అంచనాలకు అనుగుణంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఫిబ్రవరి 8న ఉదయం శ్రీ స్వామివారి యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 9 నుంచి భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారికి వివిధ వాహన సేవలు, గ్రామోత్సవం జరుగుతాయి. ఈనెల 12న రాష్ట్ర ప్రభుత్వం తరపున భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

**ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానం :** ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో ఈ నెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానం అందింది. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఆలయ బోర్డు ఛైర్మన్ రమేశ్ నాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు నేడు అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారు సీఎం చంద్రబాబుకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికతో పాటు స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం ఆలయ పండితులు వేదమంత్రాలతో ఆయనకు ఆశీర్వచనం అందించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యే, ఆలయ బోర్డు సభ్యులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, ఉత్సవాలకు వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు, భద్రత, రవాణా ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో నంద్యాల జిల్లాలోని మహానంది క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు కూడా హాజరుకావాలని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి సీఎం చంద్రబాబును ఆహ్వానించారు

## ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం..

నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన హరిప్రసాద్, హర్ష, అమృత, సుశ్రుతలను పటాన్‌చెరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

వీరిలో సుశ్రుత పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికుల సమాచారం మేరకు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. బోరంపేటకు చెందిన వీరంతా జూపార్కుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
శనివారం 7 ఫిబ్రవరి 2026

# కార్మికుల రక్తం పీల్చేందుకే లేబర్ కోడ్లు..



**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్):** శ్రమ దోపిడీకి చట్టబద్ధత కల్పించేందుకే మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కే ఏసురత్నం తీవ్రస్థాయిలో విమర్శించారు. కార్మికుల ఉద్యోగ భద్రతను హరించి, యజమానుల ఇష్టారాజ్యానికి తలుపులు తెరవడమే లేబర్ కోడ్ల అసలు ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. ట్యాంక్ బండ్ లిబర్టీ ఏఐటియుసి కార్యాలయం ముందు వాల్ పోస్టర్స్ విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులు రక్తం కార్చి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి,వాటి స్థానంలో లేబర్ కోడ్లను తీసుకురావడం ద్వారా కార్మికులను నిర్బంధిత బానిసలుగా మార్చే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు.లేబర్ కోడ్లు అమల్లోకి వస్తే ఉద్యోగ భద్రత పూర్తిగా లేకుండా పోతుందని, జీతాల పెంపు,పని గంటల పరిమితి, హక్కుల రక్షణ అన్నీ గాలికొదిలేసినట్లేనని అన్నారు.ఇవి ఆర్థిక నేరగాళ్లకు, పెద్ద కార్పొరేట్ సంస్థలకు లాభపడేలా రూపొందించారని, దీని వల్ల ప్రజల కొనుగోలు శక్తి తగ్గి దేశ ఆర్థిక వ్యవస్థే కుదేలవుతుందని హెచ్చరించారు.

రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు వ్యాపారాల్లోకి దిగిన తర్వాతే కార్మిక వ్యతిరేక చట్టాలు పుట్టుకొస్తున్నాయని విమర్శించారు.

లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేసే వరకు కార్మిక ఉద్యమం ఆగదని, అవసరమైతే మరింత ఉధృతంగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను కార్మికులంతా ఏకమై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కోట్లాది కార్మికులకు లేబర్ కోడ్లు శాపంగా మారుతున్నాయని అన్నారు. స్వాతంత్ర్య పోరాటానికి ముందు,తర్వాత సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయడం అంటే స్వాతంత్ర్య సమరయోధులను అవమానపరచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగటిత, అసంఘటిత రంగాల కార్మికులంతా పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ సంఘం అధ్యక్షులు కే.రవికిషోర్, ప్రధాన కార్యదర్శి ఎం.శివకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కే.జయకిషోర్, ట్రెజరర్ మహేష్ కుమార్, బాలకృష్ణ,వైస్ ప్రెసిడెంట్ బండారి శ్రీకాంత్,పోచయ్య, కాలిద్,తదితర నాయకులు పాల్గొన్నారు.

# ల్యాబ్ దగ్ధం ఘటన యాదృచ్ఛికం కాదు..

**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్):** నాంపల్లిలో జరిగిన ల్యాబ్ దగ్ధం ఘటన యాదృచ్ఛికం కాదు,ఇది పూర్తిగా రాజకీయ కుట్ర. ఓటుకు నోటు కేసుకు సంబంధించిన కీలక ఆధారాలు ఉన్న ల్యాబ్‌నే లక్ష్యంగా చేసుకుని ఈ దగ్ధం జరగడం వెనుక సీఎం రేవంత్ రెడ్డి హస్తం స్పష్టంగా కనిపిస్తోంది. ఓటుకు నోటు కేసులో నిజాలు బయటకు వస్తే తమ రాజకీయ భవిష్యత్తుకు ప్రమాదమని గ్రహించిన సీఎం ఆధారాల దగ్ధం ఘటనకు పాల్పడ్డారని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర రాము గౌడ్ ఆరోపించారు.ఇది ప్రజాస్వామ్యంపై నేరుగా చేసిన దాడి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే ఏ విచారణ కూడా ప్రజలకు న్యాయం చేయదు. ఆధారాలు దగ్ధమైన ఈ ఘటనపై నిజాలను దాచి పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే అనుమానం మరింత బలపడుతోంది. అందుకే నాంపల్లి ల్యాబ్ దగ్ధం ఘటనతో పాటు ఓటుకు నోటు కేసులోని అన్ని కోణాలపై సీబీఐ ద్వారా స్వతంత్ర, నిష్పక్షపాత దర్యాప్తు జరపాలని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేస్తోంది. సీబీఐ విచారణకు ప్రభుత్వం భయపడు తుంటే, ప్రజల ముందు దోషులెవరో స్పష్టమవుతుంది. నిజాలు ఎంత దాచినా బయటకు వస్తాయి. దోషులకు శిక్ష తప్పదని ఆప్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర రాముగౌడ్ అన్నారు.




# సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి

## -ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్




**ప్రజావినికిడి, (నాంపల్లి):** హైదరాబాద్ నాంపల్లిలో జరిగిన ల్యాబ్ దగ్ధం ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు హేమ సుదర్శన్ జిల్లోజు డిమాండ్ చేశారు.రాజకీయ కుట్రలో భాగంగా ఈ ఘటనకు పాల్పడ్డారని ఆరోపించారు. ఓటుకు నోటు కేసుకు సంబంధించిన కీలక ఆధారాలు ఉన్న ల్యాబ్‌నే లక్ష్యంగా చేసుకుని ఈ దగ్ధం జరగడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హస్తం స్పష్టంగా కనిపిస్తోందని దుయ్యబట్టారు. ఓటుకు నోటు కేసులో నిజాలు బయటకు వస్తే తమ రాజకీయ భవిష్యత్తుకు ప్రమాదమని గ్రహించిన సీఎం ఈ ఘటనకు పాల్పడ్డారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే ఏ విచారణ కూడా ప్రజలకు న్యాయం చేయదు. ఆధారాలు దగ్ధమైన ఘటనపై నిజాలను దాచిపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే అనుమానం మరింత బలపడుతోంది. అన్ని కోణాలపై సీబీఐ విచారణ జరుపాలని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేశారు.

# చైతన్య నగర్ కాలనీలో 32 సీసీ కెమెరాలు ప్రారంభం..

## నూతన సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన.. కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి

**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):** శనివారం రోజు బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని చైతన్య నగర్ కాలనీలో నూతన సి.సి రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన మరియు కాలనీలో 32 జజ కెమెరాలు బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి అదేవిదంగా వనస్థలిపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభం చేయడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, సీసీ కెమెరాల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని..

ఏ చిన్న సంఘటన జరిగినా సీసీ కెమెరాల ద్వారా వెంటనే తెలుసుకోవచ్చని.. సీసీ కెమెరాలు మరింత భద్రత, సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పిస్తాయని తెలిపారు. రాత్రింబవళ్లు 24 గంటలు ప్రజలకు రక్షణగా నిలుస్తాయని తెలిపారు మరియు కాలనీలో ఏర్పాటుచేసిన సిసి రోడ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఎస్ ఐ అనిల్ రెడ్డి, గౌతమ్ అలాగే కాలనీ అధ్యక్షులు సంజీవరెడ్డి,కాలనీ మాజీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, జలంధర్ రెడ్డి, మోహన్ రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి యాదయ్య, కోశాధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఎల్లమ్మ ఆలయ చైర్మన్ శివకుమార్, మాజీ చైర్మన్ రామ్ రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, జయరావు, చంద్రశేఖర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, అశోక్ కుమార్, కృష్ణారెడ్డి కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# 9వ వార్డులో ప్యాట అశోక్‌కు బీజేపీ నేతల మద్దతు

**ప్రజావినికిడి,(షాద్‌నగర్):** మున్సిపల్ ఎన్నికల వేళ 9వ వార్డు రాజకీయంగా హాట్‌టాపిక్‌గా మారింది. ప్రతి వీధి, ప్రతి కాలనీ ప్రచార నినాదాలతో మార్మోగుతోంది. బీజేపీ బలపరిచిన అభ్యర్థి ప్యాట అశోక్ కుమార్ గెలుపే లక్ష్యంగా కమల దళం సమగ్ర వ్యూహంతో ముందుకెళ్తోంది. ఇంటింటి ప్రచారం, మూలమూల సమావేశాలు, యువతతో చర్చలు, మహిళలతో ప్రత్యక్ష మట్లాడటం వంటి కార్యక్రమాలతో బీజేపీ ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన ఊపందుకుంది.ఈ నేపథ్యంలో రాష్ట్రస్థాయి నేతలు,మాజీ యువమోర్చా అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్ స్వయంగా రంగంలోకి దిగడం ప్రచారానికి మరింత ఊపునిచ్చింది.కాలనీల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇస్తున్నారు. ప్రతి ఓటు కమలానికి వేయాలని,ధర్మ పరిరక్షణకు, అభివృద్ధి సాధనకు బీజేపీనే ప్రత్యామ్నాయం అని స్పష్టం చేస్తున్నారు.

ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ,

దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న నాయకుడు నరేంద్ర మోడీ. ఆయన నాయకత్వంలో దేశం సుపరిపాలన వైపు దూసుకెళ్తోంది. అవినీతి రహిత పాలన, పారదర్శకత, ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యం.అదే మోడల్‌ను షాద్‌నగర్‌లో కూడా అమలు చేయాలని పేర్కొన్నారు.గత ప్రభుత్వాలు కాలనీల సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని,కాంగ్రెస్ 420 హామీలతో ప్రజలను మోసం చేసిందని, బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి ఆగిపోయిందని విమర్శించారు.మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల వల్ల కోట్లాది కుటుంబాలకు నేరుగా లబ్ధి చేకూరిందని ఆయన గుర్తు చేశారు.ఉజ్వల పథకంతో గృహిణులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు,పీఎం ఆవాస్ యోజనతో పేదలకు ఇళ్లు, జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఆరోగ్య భద్రత, స్వచ్ఛ భారత్‌తో పారిశుధ్యం, స్టార్టప్ స్టాండ్ అప్ ఇండియా ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు, డిజిటల్ ఇండియా ద్వారా సేవలు ప్రజల చేతుల్లోకి వచ్చాయని వివరించారు.ఈ పథకాలు బీజేపీ పాలనలో అభివృద్ధి ఎలా సాధ్యమో నిరూపిస్తున్నాయని తెలిపారు.అభ్యర్థి ప్యాట అశోక్ కుమార్ మాట్లాడుతూ, పక్క ప్రణాళికతో ప్రజాసేవకు సిద్ధం9వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పేట అశోక్ కుమార్ ముందుకు సాగుతున్నారు.షాద్‌నగర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ బలపరిచిన అభ్యర్థి పేట అశోక్ కుమార్ స్పష్టమైన మేనిఫెస్టోతో ప్రజల ముందుకు వచ్చారు. ప్రతి కాలనీలో ఉచిత ఆర్.ఓ తాగునీరు, సీసీ కెమెరాలతో భద్రత,సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,పార్కుల అభివృద్ధి, ప్రతివారం ఫాగింగ్, సోలార్ విద్యుత్ ప్లాంట్లు,వర్షపు నీటి సంరక్షణ, పేద విద్యార్థులు మహిళలకు చేయూత,ఉచిత లీగల్ సేవలు వంటి కార్యక్రమాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు.మాటలకే కాదు.పనికే ప్రాధాన్యం.9వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని,కమలం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.ప్రజాసేవే నా లక్ష్యం. గతంలో స్వల్ప ఓట్ల తేడాతో ఓడినా ప్రజల మధ్యే ఉన్నాను. ఓటమిని పాఠంగా తీసుకుని మరింత సేవ చేయాలనే సంకల్పంతో కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. తాగునీటి కొరత, డ్రైనేజ్ సమస్యలు,చెత్త పారవేయడం, రోడ్ల దుస్థితి వంటి సమస్యలు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయని, కౌన్సిలర్‌గా ఎన్నికైతే ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకువస్తానని హామీ ఇచ్చారు.మోడీ మార్గంలో అభివృద్ధి...మన వార్డులో మార్పు అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని, కేంద్ర పథకాలను పూర్తిస్థాయిలో ప్రజలకు అందేలా చేస్తానని చెప్పారు. 9వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రచారంలో పార్టీ నాయకులు,మహిళా మోర్చా సభ్యులు,యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కమలం గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరుతున్నారు. స్థానికులు కూడా బీజేపీపై విశ్వాసం వ్యక్తం చేస్తూ ఈసారి కమలం వికసించాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.9వ వార్డులో కమలం జోరు పెరిగింది. బీజేపీ ప్రచారం ఊపందుకోవడంతో ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది.ఈసారి అభివృద్ధి కోసం ప్రజలు కమలం వైపు మొగ్గు చూపుతున్నట్టు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.





# గుండ్లపల్లి శ్యాంసుందర్రావు మరణం బ్రాహ్మణ సమాజానికి తీరని లోటు

## పోచంపల్లి రమణారావు తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు..

**ప్రజావినికి,(ఎల్బీనగర్):** శనివారం నాడు హైదరాబాదులో ఒక ప్రైవేట్ హాస్పిటల్లో గుండ్లపల్లి శ్యాంసుందర్రావు గుండెపోటుతో మరణించారు. వారి మరణానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసిన తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు. బ్రాహ్మణులకు బ్రాహ్మణ సంఘాలకు అనేక సేవా కార్యక్రమాలు చేశారని గుర్తుచేశారు.వారితో ఉన్న తమ అనుబంధానికి నెమ రువేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు.వారి మరణానికి సంతాపం తెలిపిన వారు రాష్ట్ర తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవులపల్లి రంగారావు రాష్ట్రప్రధాన కార్యదర్శి ,ఖానాలశ్యాంసుందర్రావు రాష్ట్ర ఈసి మెంబర్ చకిలం నరసింహారావు, పోచంపల్లి మధుసూదన్ రావు,పంతంగి రంగారావు, పంతంగివిట్టల్ రావు.పంతంగి శ్రీకాంత్ , గుండ్లపల్లిశ్యాంసుందర్రావుకు భార్య సీత ,కుమారుడు రాకేష్ కూతురు రమ్య అల్లుడు వెంకట్ ఉన్నారు.



# ఎమ్మెల్సి నవీన్ రెడ్డి సిపారసుతో 1,30,000/ ఎల్.ఓ.సి అందచేత

## చౌదరిగూడ మండల కేంద్రంలో లబ్ధిదారునికి అందచేత

**ప్రజావినికిడి,(షాద్ నగర్):** జిల్లేడు చౌదరి గూడెం మండల కేంద్రంలో లింగాలి శ్రీనివాస్ అత్యవసర వైద్య సహాయార్థం ఉమ్మడి మహబూబ్నగర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిపారసుతో మంజురైనా 1,30,000/ విలువగల ఎల్.ఓ.సి ని చౌదరిగూడ మండల కేంద్రంలో లబ్దిదారునికి బీఆర్ఎస్ నాయకులు మీదిగడ్డ బాబురావు,మాజీ సర్పంచ్ పల్లె రాజు,మీది గడ్డ నవీన్ పటేల్,దోమ ప్రభాస్,పల్లె రవీందర్,చిట్యాల మహేష్ మీదిగడ్డ రాము,దోమ,నితిన్ తదితరులు అందచేశారు.



# రామల కలెక్షన్స్ సిల్వర్‌జ్యువెలర్స్ ఘనంగా ప్రారంభోత్సవం

## ముఖ్య అతిథిగా: "శ్రీవాణి" (సీరియల్ నటి)



**ప్రజావినికిడి, (ఎల్బీనగర్):**
,సరూర్నగర్ పిల్లర్ నెంబర్ 1553 దగ్గర "రామల కలెక్షన్" రెండవ బ్రాంచ్ ని ఘనంగా ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా సీరియల్ "నటి శ్రీ వాణి "హాజరై తమ చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ఘన ప్రారంభోత్సవం చేశారు.వారు మాట్లాడుతూ "రామల కలెక్షన్" కూకట్పల్లి "బ్రాంచ్" ప్రజల మన్ననలు పొంది బంగారు ఆభరణాలు కస్టమర్లకు అందించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. అదేవిధంగా ఈ రెండవ బ్రాంచ్ కూడా ప్రజల మన్ననలు పొంది,అభివృద్ధి చెందాలని, ఆకాంక్షించారు.ఈ సందర్భంగా యాజమాన్యాన్ని అభినందించారు.యాజమాన్యం "రామల హిమజ " మాట్లాడుతూ,మా వెబ్ సైట్ ద్వారా "ఆల్ అవర్ ఇండియా" మొత్తంలో డోర్ డెలివరీ," కొరియర్ సర్వీసెస్"ద్వారా సేవలు అందిస్తున్నాము మా "వెబ్ సైట్, రామల కలెక్షన్ డాట్ కం" లో ఆర్డర్ చేయగలరని మనవి చేస్తున్నాం. నాణ్యమైన బంగారు ఆభరణాల తయారీ విధానం శుభ కార్యములకు, వివాహ వధువులకు సరిపడు ఆభరణాలు అందుబాటులో ఉంటాయి అని వివరించారు.ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారని తెలియజేశారు.

# కాంగ్రెస్ కు ఓటు వేయడం అంటే అభివృద్ధి, సంక్షేమానికి ఓటు వేయడం

## తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి



**ప్రజావినికిడి,(షాద్ నగర్):** మున్సిపాలిటీ పరిధిలోని 23వ మరియు 24వ వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థులు అగ్గనూరు బస్వం అలాగే విశాల విశ్వంలకు ప్రజల నుండి భారీ మద్దతు,మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా షాద్ నగర్ లోని 23వ మరియు 24వ వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థులు అగ్గనూరు బస్వం మరియు విశాల విశ్వంల ను గెలిపించాలని ఓటర్ మహాశయులను అభ్యర్థిస్తూ ముమ్మరంగా ప్రచారం నిర్వహించిన మాజీ జెడ్పిటిసి విశాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,వార్డు సభ్యులు.ఈ సందర్భంగా వార్డు వ్యాప్తంగా ఇంటింటి ప్రచారాన్ని కొనసాగించారు.వార్డులోని వివిధ కాలనీల్లో పర్యటించి ప్రజలతో మమేకమై మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలుస్తుందని, ప్రజల విశ్వాసమే తమకు అసలైన బలమని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ దశలవారీగా పరిష్కారాలు చూపుతామన పేర్కొన్నారు.

# మున్సిపాలిటీలో రోడ్ షో నిర్వహించి, మూడు చోట్ల కార్నర్ మీటింగ్ లో,ఎంపీ డీకే అరుణ

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
షాద్ నగర్ మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు.ఇబ్బందులు పెడుతున్నారు ఎందుకు పెడుతున్నారంటే.. మనం గెలుస్తున్నాం కాబట్టే పెడుతున్నారు.
పట్టణాల అభివృద్ధి కి అమృత్ పథకం కింద 32 కోట్ల పెద్ద నిధులు ఇచ్చింది కేంద్ర ప్రభుత్వం.
డ్రైనేజీ,సీసీ రోడ్లు, హైమాస్ లైట్స్ లు అన్నింటినీ ఇస్తుంది కేంద్ర ప్రభుత్వం.
త్రాగునీటి సరఫరా ఇబ్బందులు లేకుండా ఎండా కాలం నాటికి పరిష్కారం చేసుకోవాలి.
బీజేపీ నీ గెలిపించుకునే.. పరిష్కారం అవుతుంది.
7వ వార్డ్ బీజేపీ అభ్యర్థి భాస్కర్ వార్డులో సీసీ కెమెరాల ఏర్పాటు,నీ ప్రతి ఓటరుకు ఐదు ఏళ్ళ ఇన్సూరెన్స్ చేయిస్తా అనే హామీ ఇచ్చాడు.
రైల్వే గేట్ల ఇబ్బందులు ఉన్నాయి.
కేశంపేట రైల్వే గేటు ఇబ్బందులు తీర్చేందుకు కృషి చేస్తా..
చేటాన్ పల్లి రైల్వే బ్రిడ్జి పూర్తి చేసుకుందాం..
అవినీతి రహిత పాలన బీజేపీ తోనే సాధ్యం.
కాంగ్రెస్,బిఆర్ఎస్ ఇద్దరికి ఓటు అడిగే హక్కు లేదు.బిఆర్ఎస్ లక్షల కోట్లు అప్పులు తెచ్చి.. వేల కోట్ల అవినీతి చేసి దోచుకున్నారు.
అవినీతి కక్కిస్తాం అని చెప్పి అధికారంలోకి వచ్చి



ఇప్పుడు చర్యలు తీసుకోవడం లేదు.
కేసీఆర్ ను రేవంత్ రెడ్డి కాపాడుతున్నారు.
కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం ఉంది.18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు 2500 రూపాయలు ప్రతి నెల ఇస్తా అన్నాడు.. ఇచ్చాడా..?
2వేల పెన్షన్లు 4వేలు చేస్తామన్నారు చేశారా..?

**ఇంకా ఎందుకు ఓటు వేయాలి**

లంకె బిందెలు లేవు..అప్పులు అడిగేందుకు వెళ్తే.. చెప్పులు ఎత్తుకెళ్లేవాళ్ళాలా చూస్తున్నారు. అప్పు పుట్టడం లేదు అంటున్నాడు.
నరేంద్ర మోదీ వికసిత్ భారత్ లక్ష్యంతో ఒక విజన్ తో పని చేస్తున్నారు.
బీజేపీ తెలంగాణ లో అధికారంలోకి రావాలని ప్రజలు ఎదిరి చూస్తున్నారు.
తెలంగాణ లో బీజేపీ అధికారంలోకి రావడానికి మున్సిపాలిటీ ఎన్నికలు పునాది కావాలి.
మున్సిపాలిటీ చైర్మన్ గా ఉంటే.. మున్సిపాలిటీ అభివృద్ధికి ఎంపీగా పూర్తిగా అండగా ఉంటా.
నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే బీజేపీ కార్యకర్తలను గెలిపించండి.

# 28వ వార్డులో చేగురి లక్ష్మీప్రసన్న వేణుగోపాల్ గెలుపు ఖాయం

## బిఆర్ఎస్ పార్టీ గెలుపు బాధ్యత మాదే అంటున్న ఓటర్లు






**ప్రజా వినికిడి,(షాద్‌నగర్):**
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 28వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి చేగురి లక్ష్మీప్రసన్న వేణుగోపాల్‌కు ప్రజల మద్దతు రోజురోజుకూ పెరుగుతుంది. ఇంటింటి ప్రచారంలో ఆమెకు స్థానికులు ఘన స్వాగతం పలుకుతున్నారు.ఈసారి గెలిపించేది లక్ష్మీప్రసన్ననే అని స్పష్టంగా చెబుతున్నారు.బిఆర్ఎస్ పార్టీని గెలిపించుకునే బాధ్యత తమదేనని ఓటర్లు తెగేసి చెబుతున్నారు. మాజీ సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదలకు అండగా నిలిచాయని,గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు వార్డులో మార్పు తీసుకువచ్చాయని ప్రజలు పేర్కొన్నారు.ఈ అభివృద్ధి ఫలాలే తమ ఓటు నిర్ణయాన్ని ప్రభావితం చేస్తున్నాయని వెల్లడించారు.
లక్ష్మీప్రసన్న వేణుగోపాల్ మాట్లాడుతూ,
ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుని వార్డు అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు.ప్రతి సమస్యకు తక్షణ పరిష్కారం చూపిస్తానని తెలిపారు.ప్రచారంలో కనిపిస్తున్న ప్రజా స్పందనను బట్టి ఈసారి 28వ వార్డులో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని కాలనీలో ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి ప్యాట జయ శ్రీకాంత్ కాలనీ మహిళలతో పాటు పాల్గొన్నారు.

# 6వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి కేతావత్ రాజేందర్ సింగ్ ప్రచార హోరు

ప్రజావినికిడి,(షాద్ నగర్):రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజలకు కష్టాలు మొదలయ్యాయనికాంగ్రెస్ అంటేనే కటిక చీకటి అని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 6వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి కేతావత్ రాజేందర్ సింగ్ (రాజు నాయక్) గెలుపును కాంక్షిస్తూ నిర్వహించిన భారీ ప్రచార ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వార్డు అంతటా గులాబీ జెండాలతో ప్రదర్శన నిర్వహించగా, బీఆర్ఎస్ శ్రేణులు స్థానిక ప్రజలు డప్పు వాయిద్యాలతో, కోలాటాలతో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కు అపూర్వ స్వాగతం పలికారు. ఈ ప్రచార కార్యక్రమానికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, జెడ్పి మాజీ వైస్ చైర్మన్ ఈటె గణేష్,మిట్టు నాయక్, రాంపల్లి నాయక్ తదితర ముఖ్య నాయకులు హాజరయ్యారు.

**అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం..**

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. "గత పదేళ్లలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ వెలుగులు జిమ్మగా,నేడు కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోతలు, ప్రజా సమస్యలు రాజ్యమేలుతున్నాయన్నారు. ముఖ్యంగా అన్ని వర్గాల వారిని నమ్మించి మోసం చేసిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందని ఆయన విమర్శించారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని షాద్ నగర్ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఏ వార్డుకి వెళ్లిన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని,



బీఆర్ఎస్ పార్టీ మళ్ళీ రావాలని కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. 6వ వార్డు సమగ్ర అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుపై ఓటు వేసి రాజేందర్ సింగ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి" అని పిలుపునిచ్చారు.

**చందు నాయక్ వ్యూహంతో క్లీన్ స్వీప్..**

వార్డు ఇంచార్జ్, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందు నాయక్ అత్యంత చాకచక్యంగా ప్రచార వ్యూహాలను రూపొందిస్తూ వార్డులో పార్టీని పటిష్టం చేస్తున్నారు.గల్లీ గల్లీలో తిరుగుతూ ప్రతి ఓటరును స్వయంగా కలుస్తూ అభ్యర్థి రాజు నాయక్ చేసిన సేవా కార్యక్రమాలను, మంచి తనాన్ని ప్రజలకు వివరిస్తున్నారు. సర్పంచ్ చందు నాయక్ మాట్లాడుతూ,రాజేందర్ సింగ్ (రాజు నాయక్) గెలుపు ఇప్పటికే ఖాయమైందన్నారక్షేత్రస్థాయిలో ప్రజల నుండి వస్తున్న స్పందన చూస్తుంటే ప్రతిపక్షాలకు డిపాజిట్లు కూడా దక్కవని అర్థమవుతోందన్నారు.వార్డు ప్రజల సమస్యలను తీర్చడమే లక్ష్యంగా పనిచేసే నాయకుడు రాజు నాయక్. ఆయననుఅత్యధిక మెజారిటీతో గెలిపించడానికి వార్డు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారు" అని ధీమా వ్యక్తం చేశారు.ప్రచారంలో వెల్లువెత్తిన జనసందోహం.ఈ కార్యక్రమంలో అభ్యర్థి కేతావత్ రాజేందర్ సింగ్ మాట్లాడుతూ, తనకు అవకాశం ఇస్తే వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.ఈ ర్యాలీలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు,మాజీ సర్పంచ్ శేఖర్ రెడ్డి, జగదీశ్వర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ రాజు నాయక్, మాజీ సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి, శేరిగూడ సర్పంచ్ రాజు నాయక్ అనుబంధ సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి "జై తెలంగాణ..జై జై బీఆర్ఎస్" నినాదాలతో వార్డును హోరెత్తించారు.

# విద్యతో పాటు సంస్కారం కూడా నేర్పండి

## పిల్లలను తీర్చిదిద్దే బాధ్యత విద్యాలయాలదే

## మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



విశాఖపట్నం,,**ఫిబ్రవరి 7ప్రజావినికిడి,** విద్యాసంస్థల్లో పిల్లలకు విద్యతో పాటు సంస్కారాన్ని కూడా నేర్పించాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. పిల్లలను సంస్కారవంతులుగా తీర్చిదిద్దే బాధ్యత విద్యాలయాలపై ఉందన్నారు. చదువు అంటే కేవలం ఉద్యోగం సంపాదించడమే కాదని, సమాజానికి ఉపయోగపడే మంచి వ్యక్తులుగా విద్యార్థులు ఎదగాలని సూచించారు. అభివృద్ధి అంటే భవనాలు కట్టడం మాత్రమే కాదని, ప్రకృతిని కాపాడుకునే బాధ్యత కూడా అందరిపై ఉందన్నారు. పెందుర్తిలోని బాలాజీ హై ఫీల్డ్స్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం.. భారతదేశమని అన్నారు వెంకయ్యనాయుడు. ఈ మధ్యకాలంలో కొంతమంది నాయకులు విర్రవీగుతూ బూతులు తిడుతున్నారని విమర్శించారు. అలాంటి వారికి ప్రజలు పోలింగ్ బూత్‌లోనే తగిన సమాధానం చెప్పాలన్నారు. రాజకీయ నాయకులకు బూతులు మాట్లాడటం ఒక ఫ్యాషన్‌లా మారిపోయిందని మండిపడ్డారు. ఎంత ఎక్కువ బూతులు మాట్లాడితే అంత పబ్లిసిటీ వస్తుందని కొందరు భావిస్తున్నారని విమర్శించారు. రాజకీయ నాయకులు అందరికీ ఆదర్శంగా ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి సూచించారు. కార్యక్రమంలో పెందుర్తి శాసనసభ్యులు కంచికల రమేశ్ బాబు, విశాఖపట్నం మేయర్ పీల శ్రీనివాస్‌లతో పాల్గొన్నారు. ఇందులో భాగంగా స్కూల్ పిల్లలతో కొంతసేపు సరదాగా మాట్లాడిన మాజీ ఉపరాష్ట్రపతి.. ఆ తర్వాత స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు.

# సిద్దిపేటలో సంచరిస్తున్న పెద్దపులి

సిద్దిపేట,,**ఫిబ్రవరి 7ప్రజావినికిడి,** సిద్దిపేట జిల్లాలోని దూల్మిట్ట మండలం కూటిగల్, భైరన్‌పల్లి శివారులో పులి సంచారం తీవ్ర కలకలం రేపింది. మద్దూర్ మండలం లద్నూర్, అమ్మాపూర్ గ్రామాల్లో పులి.. లేగ దూడలపై దాడిచేసి చంపడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులు.. పులి పాదముద్రలను పరిశీలించారు. పులి పాదముద్రల ఆధారంగా యాదాద్రి జిల్లా నుంచి సిద్దిపేటలోకి ప్రవేశించినట్లు అటవీ అధికారులు గుర్తించారు. దూల్మిట్ట, మద్దూర్ మండలాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, సాయంత్రం వేళ బయటకు రావొద్దని హెచ్చరించారు. ప్రస్తుతం పాదముద్రల ఆధారంగా పులి జాడ కోసం అధికారులు అన్వేషిస్తున్నారు.

## స్కూల్ బస్సులో మంటలు.. పిల్లకు తప్పిన ప్రాణాపాయం



జయశంకర్ భూపాలపల్లి **,ఫిబ్రవరి 7ప్రజావినికిడి,:** చిట్యాల మండలం చల్ల గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు పాఠశాల బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. అయితే, ప్రమాద సమయంలో బస్సులో 15 మంది విద్యార్థులు ఉన్నారు. డ్రైవర్, గ్రామస్థులు వెంటనే అప్రమత్తమై పిల్లల్ని బస్సు నుంచి కిందకు దింపడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు. ఈ ఘటనపై రవాణా శాఖ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. స్కూల్ బస్ ఫిట్ నెస్ తోపాటు మంటలు రావడానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ఈ ఘటనలో విద్యార్థులకు ఎటువంటి గాయాలు, ప్రాణ నష్టం జరగకపోవడంతో తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు.

----------

# ఈఎన్‌సిగా రమేశ్ బాబు నియామకం



హైదరాబాద్,**ఫిబ్రవరి 7ప్రజావినికిడి,**ఎట్టకేలకు తెలంగాణ ప్రభుత్వం నీటిపారుదల శాఖ ఈఎన్సీని నియమించింది. గత నెలలో పదవీ విరమణ పొందిన అంజద్ హుస్సేన్ స్థానంలో ఓలేటి వెంకట రమేశ్ బాబును నియమించింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ నియమాకంపై ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వెంకట రమేశ్‌బాబుకు ఈఎన్‌సీగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆయన సూర్యాపేట, ఖమ్మం జిల్లాల చీఫ్ ఇంజినీర్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఇరిగేషన్‌లో ఈఎన్సీ(జనరల్) స్థానం అత్యంత కీలకం. గతంలో ఈ శాఖను 19 టెరిటో రియల్స్‌గా విభజించగా మైనర్, మీడియం, మేజర్ ప్రాజెక్టులన్నీ ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చి ఆయా చీఫ్ ఇంజినీర్లకే బాధ్యతలను అప్పగించింది. అన్ని విభాగాలపై పూర్తిస్థాయి నిర్ణయాధికారాన్ని ఈఎన్సీకే కట్టబెట్టింది. ఇరిగేషన్ శాఖ, డ్యామ్ సేఫ్టీకి సంబంధించి రాష్ట్రస్థాయి కమిటీల్లోనూ ఈఎన్సీకే పూర్తి అధికారాలున్నాయి. ఇప్పటివరకు ఈఎన్సీగా పనిచేసిన అంజద్ హుస్సేన్ జనవరి 31న విరమణ పొందారు. సాధారణంగా కీలకమైన స్థానం ఖాళీ అవుతుంటే ముందుగానే తాత్కాలికంగానైనా ఇన్‌చార్జిని నియమించడం పరిపాటి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వారం రోజులైనా భర్తీ చేయకపోవడం ఇటీవల చర్చనీయాంశంగా మారింది. అయితే ఈఎన్సీ జనరల్ స్థానం భర్తీ కాకపోవడానికి ప్రధాన కారణం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ మధ్య పేచీనే కారణమనే చర్చ జోరుగా వినిపిస్తున్నది.

# భద్రాద్రికి ఏం చేశారని ఓట్లు వేయాలి

## కాంగ్రెస్‌ను ప్రశ్నించిన ఎంపి వద్దిరాజు



భద్రాద్రి కొత్తగూడెం,,**ఫిబ్రవరి 7ప్రజావినికిడి,** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకి ఏం చేశారని కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడుగుతుందని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సూటిగా ప్రశ్నించారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం 53,54,29,30 వార్డుల్లో ప్రచారం చేసి మాట్లాడారు. కాంగ్రెస్ తప్పుడు హామీలతో అధికారులకు వచ్చిందని, రెండేళ్లయినా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. కేవలం కేసీఆర్ కుటుంబాన్ని తిట్టుకుంటూ కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటు ద్వారా కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని, బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి బూతు పిత అన్నారు. నో రిప్పితే అబద్దాలు అడ్డగోలు ప్రేలాపణలు తప్ప అభివృద్ధి కోసం మాట్లాడే శక్తి లేదన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, రావులపల్లి రాంప్రసాద్, అభ్యర్థులు మహేష్, పద్మ.. సాగర్, రాజేష్, కాపు కృష్ణ, బొమ్మిడి రామకాంత్, మామిడి శ్రీను, కరాటే శ్రీను, తదితరులు పాల్గొన్నారు

# క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం..

## అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవనానికి శంకుస్థాపన

**ఇది చారిత్రక ఘట్టం: సీఎం చంద్రబాబు**

**క్వాంటమ్ కంప్యూటింగ్‌కు కేంద్ర సహకారం**

**టెక్నాలజీ అభివృద్ధిలో కీలకం కానుందన్న కేంద్రమంత్రి జితేంద్ర సింగ్**

**ఇది కేవలం ఏపీకి కాదని, యావత్ భారతదేశ చరిత్రలో ఒక చారిత్రక రోజని సీఎం వ్యాఖ్య**

**క్వాంటమ్ విప్లవానికి భారత్ నాయకత్వం వహిస్తుందన్న ధీమా**




**అమరావతి ,ఫిబ్రవరి 7ప్రజావినికిడి,**
"ఇది కేవలం అమరావతికో, ఆంధ్రప్రదేశ్‌కో సంబంధించిన రోజు కాదు. యావత్ భారతదేశ చరిత్రలో ఇదొక చారిత్రక దినం. గతంలో మనం వ్యవసాయ, పారిశ్రామిక విప్లవాలను అందిపుచ్చుకోలేకపోయాం. కానీ, కమ్యూనికేషన్, ఐటీ విప్లవంలో వేగంగా అడుగులు వేశాం. ఇప్పుడు ప్రపంచం ముందున్న క్వాంటమ్ విప్లవంలో మనం అనుసరించడం కాదు, ఏకంగా నాయకత్వం వహించబోతున్నాం. ఆ మహాయజ్ఞానికి అమరావతి నుంచే పునాది వేస్తున్నాం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి భవిష్యత్తును, తద్వారా దేశ సాంకేతిక ప్రగతిని నిర్దేశించే 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శనివారం కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు తన దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు.

ఆనాటి రోజులను గుర్తు చేసుకున్న చంద్రబాబు, "1995లో నేను ముఖ్యమంత్రి అయినప్పుడు బిల్ గేట్స్ ఇంటర్నెట్‌ను ఆవిష్కరించారు. అప్పుడు దాని ప్రాముఖ్యతను గుర్తించి రాష్ట్రాన్ని ఆ దిశగా నడిపించా. మాజీ ప్రధాని వాజ్‌పేయి గారు టెలికమ్యూనికేషన్ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, నేను హైటెక్ సిటీని ప్రారంభించడం దేశ ఐటీ రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలిచాయి. ఆనాడు వాజ్‌పేయి గారు హైటెక్ సిటీని ప్రారంభిస్తే, నేడు క్వాంటమ్ వ్యాలీకి ఇక్కడ పునాది పడింది. ఇది దేశానికే మరో గేమ్ ఛేంజర్ అవుతుంది. ఈ చరిత్రలో మనమందరం భాగస్వాములం" అని ఉద్వేగంగా ప్రసంగించారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ క్వాంటమ్ వ్యాలీ రూపుదిద్దుకోనుంది. ఇది కేవలం ఒక భవనం కాదు, క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, రక్షణ, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రంగా మారనుంది. వచ్చే 40 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు సీఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ, "భారతదేశంలోనే తొలి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావాలి. ఒకటి రెండు నెలల్లో ఒప్పందాలు పూర్తిచేసి, ఈ ఏడాది చివరికల్లా తొలి క్వాంటమ్ కంప్యూటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాలి. ఏప్రిల్ 14 నాటికి మరో రెండు క్వాంటమ్ సెంటర్లను కూడా ప్రారంభిస్తాం" అని లక్ష్యాలను నిర్దేశించారు. 2030 నాటికి రాష్ట్రంలో 2.5 లక్షల మంది క్వాంటమ్ నిపుణులను తయారు చేయాలనే బృహత్ ప్రణాళికను ఆయన వివరించారు. అమరావతిని ప్రపంచ పటంలో నిలపాలన్న తన సంకల్పానికి బలం చేకూరుస్తూ, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఈ నెల 16న అమరావతికి రానున్నట్లు చంద్రబాబు ప్రకటించడం సభలో హర్షాతిరేకాలు రేపింది. దేశంలోని ఐటీ నిపుణుల్లో 35 శాతం మంది తెలుగువారేనని గుర్తు చేస్తూ, వారి ప్రతిభను రాష్ట్ర భవిష్యత్తు కోసం వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, మంత్రులు నారాయణ, కందుల దుర్గేశ్, ఐఐటీ, టీసీఎస్, ఐబీఎం, ఎల్ అండ్ టీ సంస్థల ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ శంకుస్థాపన, ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ సాంకేతిక హబ్‌గా మార్చే ప్రయాణంలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

# హైదరాబాదు నగర అభివృద్ధికి రెండేళ్లలో రూ.20 వేల కోట్లు

## : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**రంగారెడ్డి జిల్లా: ,ఫిబ్రవరి 7ప్రజావినికిడి,**
హైదరాబాదు నగర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కేవలం రెండేళ్ల కాలంలోనే రూ.20 వేల కోట్ల నిధులు కేటాయించిందని, రాష్ట్ర చరిత్రలో ఇదొక అపూర్వ నిర్ణయమని డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం హైటెక్స్‌లో నిర్వహించిన క్రెడాయ్ ప్రాపర్టీ ఎగ్జిబిషన్ షోలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.1,950.52 కోట్లు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు పరిధిలో రూ.12,500 కోట్లు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో రూ.4,365 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పెట్టుబడులు, ప్రతిభ, జీవన నాణ్యత పరంగా హైదరాబాద్ దేశంలోని నగరాలతోనే కాకుండా ప్రపంచంలోని అగ్ర నగరాలతో పోటీ పడుతోందన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం ద్వారా ఒకే విధమైన పౌర సేవలు, సమగ్ర పట్టణ ప్రణాళిక, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఏకీకృత అభివృద్ధి దృక్పథం సాధ్యమైందన్నారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రోగ్రాం కింద రూ.7,032 కోట్లకు పైగా వ్యయంతో 45 ప్రధాన ఫ్లైఓవర్లు, అండర్‌పాసులు, 10 రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని తెలిపారు. కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణకు రూ.1,090 కోట్లు వెచ్చిస్తున్నామని, పడమటి కారిడార్‌లో అంతర్జాతీయ సమాచార సాంకేతిక సంస్థ మరియు ఖాజాగూడ వద్ద రూ.837 కోట్లతో మల్టీలెవల్ ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నామని వివరించారు. ఉత్తర హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యల నివారణకు రూ.960 కోట్లతో ప్రత్యామ్నాయ రహదారి నెట్‌వర్క్‌లు, తూర్పు భాగంలో టీకేఆర్ కాలేజ్, గాయత్రి నగర్, మండమల్లమ్మ జంక్షన్ వద్ద రూ.416 కోట్లతో ఫ్లైఓవర్లు, దక్షిణ హైదరాబాద్‌లో రూ.863 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. నగరంలోని ఏ ప్రాంతాన్నీ నిర్లక్ష్యం చేయడం లేదని స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి ప్రాజెక్టులు ప్రయాణ సమయాన్ని తగ్గిస్తూ, ఆర్థిక కార్యకలాపాలను బలోపేతం చేసి, భూవిలువలను పెంచుతున్నాయని, ముఖ్యంగా సాధారణ ప్రజల రోజువారీ జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని అన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్2047 కింద క్లీన్‌యూనిఫైడ్‌రిజిలియంట్‌ఈక్విటబుల్ వ్యూహంతో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. వరదల భద్రత, వాతావరణ అనుకూలత కోసం సమగ్ర స్టార్మ్ వాటర్ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని, సమగ్ర మొబిలిటీ, బ్లూగ్రీన్ మాస్టర్ ప్లాన్‌లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. దేశంలోనే అత్యంత నివసించదగిన, పెట్టుబడులకు అనుకూలమైన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజల సేవ కోసమే ఉందన్న నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని అన్నారు.

# ఔటర్ బయట వరకు హైడ్రాను విస్తరించాలి

## ఫోన్‌ఇన్ కార్యక్రమంలో పలువురు వినతి



హైదరాబాద్,,**ఫిబ్రవరి 7ప్రజావినికిడి,** ప్రభుత్వ స్థలాలు, నీటి వనరుల పరిరక్షణ కోసం హైడ్రా పరిధిని ఔటర్ రింగురోడ్డు బయట కూడా విస్తరించాలని పలువురు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. హైడ్రా కార్యాలయంలో తొలిసారి నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి గంట వ్యవధిలో 36 మంది ఫోన్ చేసి భూ ఆక్రమణలు, నీటి వనరులు కలుషితమవుతున్న తీరును వివరించారు. భూ ఆక్రమణదారులను ఉపేక్షించవద్దని హైడ్రాను కోరారు. తమ ప్రాంతాల్లో ఉన్న చెరువుల్లో మురుగు చేరుతోందని, దుర్గంధభరిత వాతావరణంలో అవస్థలు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పార్కులు, రహదారులు, ప్రభుత్వ స్థలాలు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాకు గురి అవుతున్నాయని, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి నడక దారి లేకుండా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దుండిగల్ మున్సిపాలిటీలోని గాగిలాపూర్‌లో రహదారులను ఆక్రమించి ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారని తెలిపారు. ప్రగతినగర్ వద్ద ఓ పార్కులో ఆలయం నిర్మాణానికి ప్రయత్నిస్తున్నారని, నాగిరెడ్డి కుంటలోకి మురుగు చేరకుండా చేపట్టిన డైవర్షన్ కాలువ నిర్మాణ పనులు ఆగిపోయాయని, మాదాపూర్‌లోని సున్నం చెరువు వద్ద పేరుకు వంద అడుగుల రహదారి ఉన్నా.. మొత్తం నీటి ట్యాంకర్లతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని ఆయా ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా కమిషనర్.. వారం వ్యవధిలో సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొదటి విడత 6 చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, త్వరలోనే 14 చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు.

# విపక్షంగా కాంగ్రెస్ వైఫల్యం

**,ఫిబ్రవరి 7ప్రజావినికిడి,**
దేశంలో రాజకీయ నేతలు బానిస భాజాలంతో బతుకుతున్నారు. అధికారపక్షంపై బట్టకాల్చి మీద పడేస్తే.. తరవాత అధకారం మనదే అన్న ధోరణిలో ఉన్నారు. ఎవరి లక్ష్యమైనా అధికారమే. అధికారంలో ఉన్నవారు దానిని కాపాడుకునే ప్రయత్నం..లేనివారు అధికారంలోకి వచ్చే ప్రయత్నాల్లో విన్యాసాలు చేస్తున్నారు. తాజాగా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఎవరి పేరుందో వెతికి మరీ విమర్శలకు దిగుతున్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఇందులో ముందున్నారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతన్న వేళ సమస్యలపై పోరాటం ఆపేశారు. ప్రజల పక్షాలన పోరాడలేక చతికిల పడ్డారు. పార్లమెంట్‌కు రావడం గోల చేయడం, వాకౌట్ చేయడం ఇదీ విపక్షాలు అలవాటు చేసున్న నమూనా. అధికార బిజెపి ఏదయితే కోరుకుంటుందో అదే చేస్తున్నారు. మనదేశంలో జరిగిన దారుణ ఘటనలకు సంబంధించి కాశ్మీర్ ఫైల్స్, కేరళ ఫైల్స్‌పై చర్చ అసవరం లేదు. దేశంలో జరుగుతున్న సమస్యలపై చర్చ పట్టదు. ఉపాధిపతకానికి గాంధీ పేరు తొలగించారని ఆందోళన చేస్తారు. ఇది ప్రజలకు కూడాగుడ్డా పెట్టేది కాదు. నిజానికి ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో రాహుల్ ఓ అసమర్థ నేత అని ఉంది. అది నిజమే అన్నట్లుగా గత పదేళ్లుగా రాహుల్ ప్రజల సమస్యలపై ఒక్కటంటే ఒక్క పోరాటం చేయలేదు. పార్లమెంట్‌లో పోరాడడం లేదు. నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకోవడం లేదు. అందుకే కాంగ్రెస్ పార్టీకి ఏమైంది అన్న ఆందోళన కలుగుతోంది. నాయకత్వ సమస్య ఈ పార్టీని పట్టిపీడిస్తున్నది. సుదీర్ఘ కాలం అధికారంలో కొనసాగిన ఆ పార్టీ నాయకత్వం ఇప్పుడు వెలవెలబోవడానికి కారణం కేవలం రాహుల్ అన్నదే గుర్తించాలి. కాంగ్రెస్ పార్టీ జవసత్వాలు పొందడానికి కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్ పాదయాత్ర చేసి ఇప్పుడేమో అచేతనంగా ఉండిపోయారు. పార్టీ జవసత్వాలు కోల్పోవడానికి ఆ పార్టీ నాయకత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. నవతరం ఆశిస్తున్నది ఏమిటో గుర్తించి అందుకు అనుగుణంగా పార్టీని తీర్చిదిద్దడంలో, విధానాల రూపకల్పనలో కాంగ్రెస్ నాయకత్వం పూర్తిగా విఫలమవుతోంది. వరుస ఓటములతో పార్టీ భవిష్యత్తు



మసకబారిన సమయంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ పెద్దగా కార్యాచరణ చూపడం లేదు. మోడీ వైపల్యాలను ఎండగట్టడానికి పార్లమెంట్ మంచి వేదిక. పార్లమెంటులో వివిధ అంశాలను లేవనెత్తి వాటిపై చర్చించే అవకాశం ఉంటుంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం కావచ్చు, బడ్జెట్ ప్రసంగం కావచ్చు...వీటిపై చర్చలో ప్రభుత్వ విధానాలను ఏకిపారేయవచ్చు. కానీ దానిని ఉపయోగించు కోవడంలో విపక్షనేతగా రాహుల్ పూర్తిగా విఫలం అయ్యారనే చెప్పాలి. సంబంధం లేని మాజీ ఆర్మీ చీఫ్ నరవాణెళి రాతలను ప్రస్తావిచడం ద్వారా అభాసుపాలయ్యారు. ఎందుకంటే ఆ పుస్తకం ఇంకా అచ్చు కాలేదు. ఇలా వరుస వైఫల్యాలను చూసిన తరవాత కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు ఉంటుందన్న నమ్మకం కలగడం లేదు. 75 ఏళ్లకు చేరువలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పోటీపడటంలో 50 ఏళ్లు పైబడిన రాహుల్‌గాంధీ ఎందుకు వెనుకబడుతున్నారు. ప్రజలు ఏమి కోరుకుంటున్నారన్నది పట్టించుకోవడం లేదు. వారి ఆలోచన ల్లో వచ్చిన మార్పు ఏమిటి అన్నది పసిగట్టలేకపోవడమే కారణంగా కనిపిస్తోంది. ప్రజల ఆలోచనల్లో వస్తున్న మార్పును గుర్తించడానికి నిరాకరిస్తూ తుప్పు పట్టిన భావజాలాన్నే కొనసాగించడం వల్లనే కమ్యూనిస్టు పార్టీలు అంతర్థానం అయ్యాయి. వారు ఇప్పటికీ అది గమనించడం లేదు. అమెరికాతో ఒప్పందాన్ని కూడా వ్యతిరేకించడమంటే అంతకు మించిన దౌర్భాగ్యం మరోటి లేదు. ప్రపంచంలో మనదేశం మనుగడ సాగించాలంటే ఒప్పందాలు తప్పవు. ట్రంప్ బెదరింపుల కారణంగా ఇంతకాలం మోడీ నిశ్శబ్దంగా ఉన్నారు. ఇప్పుడు ఒప్పందానికి ఓకే చెప్పిన తరవాత కాంగ్రెస్, కమ్యూనిస్టులు విమర్శలు చేస్తున్నారు. ఇదే వారి నాయకత్వ లోపానికి, అంతర్జాతీయ అవగాహన లేదనడానికి నిదర్శనంగా చూడాలి. ప్రపంచీకరణ కారణంగా కష్టపడే వారికి ఉపాధి అవకాశాలకు కొదవ లేదు. జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడ్డాయి. ఫలితంగా మనవాళ్లు ఏదేశమైన వెళ్లి పనిచేసుకో గలుగుతున్నారు. రాజకీయ పార్టీలు ప్రపంచ పరిణామాలకు అనుగుణంగా సాగాలి. అవి మన ప్రజలకు ఎలా ఉపయోగమో ఆలోచన చేయాలి. అలా చేయకపోవడం వల్లనే కాంగ్రెస్, కమ్యూనిస్టులు కాలక్రమంలో మెజారిటీ ప్రజలకు దూరమయ్యారు. యువతరానికి పూర్తిగా దూరమయ్యారు. కాంగ్రెస్ పార్టీలో ఆలోచనా పరులు లోపించారు. ఒకరిద్దరు రాహుల్‌ను కంట్రోల్ చేస్తున్నారు. అందుకే ఆయన ఆలోచనలు ఎంతసేపు మోడీని దింపడమెలా అన్న ధోరణిలో సాగుతున్నారు. మోడీని దింపేముందు మోడీ పనులను నిలదీఏ ప్రయత్నాలు చేయడం లేదు. మోడీని దోషజగా నిలబెట్టే యత్నాలు చేయడం లేదు. తొలి తరం కాంగ్రెస్ నాయకత్వం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ రంగాన్ని ప్రోత్సహించింది. ఆ తర్వాత దశలో ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రైవేటీకరణను ప్రోత్సహించారు. పివి నరసింహారావు సంస్కరణ పుణ్యమా అని ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే పేదల సంక్షేమం చేపట్టవచ్చని నమ్మారు. సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగి, మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్న పార్టీ నాయకుడి చర్యలు కాలానుగుణంగా ఉండడం లేదు. ముత్తాత జవహర్‌లాల్ నెహ్రూ, నాయనమ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాజీవ్‌గాంధీ, పివి నరసింహారావు, మన్మోహన్ సింగ్‌లు అనుసరించిన విధానాలను రాహుల్‌గాంధీ అధ్యయనం చేయకపోవడం వల్ల దౌర్భాగ్యంగా చూడాలి. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల మనోభావాలకు అనుగుణంగా వ్యూహ రచన చేస్తూ భారతీయ జనతా పార్టీని విజయపథంలో నిలబెడుతున్నారు. '75 ఏళ్ల వయసులో కూడా ప్రధాని మోదీ యువతను ఆకర్షించడానికి కారణం ఏమిటన్నది ఆలోచన చేస్తున్నారు. కాంగ్రెస్ తన నాయకత్వ పటిమను బలపర్చుకోకుంటే రాణించడం కలష్టమన్న విషయం రాహుల్ ఎంత తొందరగా గుర్తిస్తే అంతమంచిది.

# నిరుద్యోగులకు నకిలీ డీఎస్పీ టోకరా

### ఉద్యోగాల పేరుతో లక్షల్లో వసూళ్లు

### అరెస్ట్ చేసి విచారిస్తున్న పోలీసులు



విశాఖపట్నం,**,ఫిబ్రవరి 7ప్రజావినికిడి,**
పోలీస్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి అమాయకుల నుంచి లక్షలు కొట్టేశాడో దుర్మార్గుడు. చెల్లుబోయిన లోచన కుమార్ అనే వ్యక్తి నకిలీ డీఎస్పీ వేషంలో లక్షల రూపాయల వసూళ్లకు పాల్పడ్డాడు. ఈ వ్యవహారం ప్రస్తుతం.. విశాఖ నగరంలో సంచలనం సృష్టిస్తోంది. 2019 నుంచి 2026 వరకు తాను డీఎస్పీ, ఎస్పీ అని చెబుతూ పలు మోసాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై విశాఖ పోలీసులు సీరియస్‌గా దర్యాప్తు చేపట్టారు. నెల్లూరు డీటీసీ(డిస్టిక్ ట్రైనింగ్ సెంటర్)లో గెస్ట్ ఫ్యాకల్టీగా వెళ్లిన నకిలీ డీఎస్పీ.. పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. నెల్లూరులో దొరికిన నకిలీ డీఎస్పీని విశాఖపట్నానికి తీసుకువచ్చారు పోలీసులు. గ్రూప్ 1 పరీక్షల్లో సత్తా చాటినట్లు లోచన కుమార్ పలు పత్రికల్లో ఫేక్ ప్రచారాలు చేశాడు. అతడిపై విశాఖ సిటీ పరిధిలోని ఎయిర్‌పోర్ట్ పీఎస్‌లో రెండు కేసులు, ఎంవీపీ పీఎస్, మల్కాపురం పీఎస్, ఫోర్త్ టౌన్ పీఎస్‌లలో చీటింగ్, ఎక్స్‌టార్షన్, జాబ్ ఫ్రాడ్ వంటి కేసులపై ఎఫ్ఐఆర్ నమోదయ్యాయి. సివిక్ సెంటర్ ఐఏఎస్ అకాడమిలో శిక్షణ తీసుకున్నట్లు సోషల్ మీడియాలో బిల్డప్ ప్రచారాలకు దిగాడు. లోచన కుమార్ మోసాలపై విశాఖపట్నం పోలీసులు విచారణ చేపట్టారు. నకిలీ డీఎస్పీ లోచన కుమార్ మోసాలపై విశాఖపట్నం నగర పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇతనికి సహకరించిన వ్యక్తులు ఇంక ఎవరైనా ఉన్నారా, నగదు లావాదేవీలు ఎవరెవరి ఖాతాల్లోకి వెళ్లాయా అని ఆరా తీస్తున్నారు. ఇతర జిల్లాల్లోనూ ఇలాంటి కేసులు ఏమైనా ఉన్నాయా అనే కోణాల్లో పోలీసుల దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ కేసు నేపథ్యంలో పోలీసులు అభ్యర్థులకు ముఖ్య సూచనలు చేస్తున్నారు. పోలీస్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో ఎవరు డబ్బులు అడిగినా వెంటనే అప్రమత్తంగా ఉండాలని, అధికారిక నోటిఫికేషన్లు, నియామక ప్రక్రియల ద్వారానే ఉద్యోగాలు వస్తాయని పోలీసులు గుర్తు చేశారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి డబ్బులడిగితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

# అమెరికాతో ఒప్పందం మనకే నష్టం

### మన రైతులకు తీరని అన్యాయం జరగనుంది

### ఎక్స్ వేదికగా కాంగ్రెస్ జైరామ్ రమేశ్ విమర్శలు

న్యూఢిల్లీ,**,ఫిబ్రవరి 7ప్రజావినికిడి,**
భారత్ అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కేంద్రాన్ని తీవ్రంగా విమర్శించారు. అమెరికా వ్యవసాయోత్పత్తులపై భారత్ దిగుమతి సుంకాల్ని తగ్గించడం వల్ల అమెరికా రైతులకే ప్రయోజనం చేకూరుతుందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఇటీవల విడుదల చేసిన అమెరికా- భారత్ సంయుక్త ప్రకటనలో.. ఆ ఒప్పందంకి సంబంధంచిన వివరాలేమీ లేవు. భారత్ ఇకపై రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకోదనే విషయం మాత్రం స్పష్టంగా తెలుస్తుంది. అలాగే రష్యా నుండి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా చమురు కొనుగోలు చేస్తే 25 శాతం జరిమానాను



భారత్‌పై తిరిగి విధించ్చని అమెరికా ప్రకటించింది' అని రమేష్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడిని ఆయన విమర్శించారు. ట్రంప్‌తో మోడీ దిగిన ఫొటోలను ప్రస్తావిస్తూ.. 'ఫొటో ఆప్స్ భారతదేశానికి పెద్దగా ప్రయోజనం చేకూర్చలేదని, దౌత్య వైఫల్యాన్ని సూచిస్తున్నాయని ఆయన అన్నారు. భారతీయ రైతులను పణంగా పెట్టి అమెరికన్ రైతులకు సహాయం చేయడానికి భారతదేశం దిగుమతి సుంకాలను తగ్గిస్తుంది. ఈ ఒప్పందంతో అమెరికా నుండి భారత్ వార్షిక దిగుమతులు మూడురెట్లు పెరుగుతాయి. మన దీర్ఘకాల వస్తువుల వాణిజ్య మిగులు తుడిచిపెట్టుకుపోతుంది. భారత్ నుంచి అమెరికాకు ఐటి, ఇతర సేవల ఎగుమతులపై తీవ్ర అనిశ్చితి కొనసాగుతుంది. అలాగే అమెరికాకు ఎగుమతులు చేసే భారత్ వస్తువులపై గతకంటే ఎక్కువ సుంకాలు విధిస్తారు. దీన్నిబట్టి చూస్తే.. ట్రంప్‌ను చేసుకున్న కౌగిలింతలు, దిగిన ఫొటోలు పెద్దగా ఫలించలేదు. నమస్తే ట్రంప్.. హౌడీ మోడీపై స్కోర్ చేసింది. స్నేహితుడు ఇకపై స్నేహితుడు కాదు అని జైరాం రమేశ్ అన్నారు.

# సైబర్ నేరాలపై సైబరాబాద్ పోలీసుల ఉక్కుపాదం

### 9 కేసుల ఛేదన...12 మంది నిందితుల అరెస్టు

హైదరాబాద్,**,ఫిబ్రవరి 7ప్రజావినికిడి,**
సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు జనవరి 30 నుంచి ఫిబ్రవరి 5 వరకు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తులో భాగంగా మొత్తం 9 సైబర్ క్రైమ్ కేసులను విజయవంతంగా ఛేదించి, దేశంలోని పలు రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న 12 మంది నిందితులను అరెస్టు చేసినట్లు సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్ తెలిపారు. ఈ అరెస్టుల్లో అత్యధికంగా 7 అరెస్టులు ట్రేడింగ్ మోసాలకు సంబంధించినవని తెలిపారు. మొత్తం కేసుల్లో ట్రేడింగ్ ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్, పార్ట్‌టైం జాబ్ ఫ్రాడ్, మ్యాట్రిమోనీ ఫ్రాడ్ వంటి వివిధ రకాల సైబర్ నేరాలు ఉన్నట్లు వెల్లడించారు. అదే సమయంలో బాధితులకు ఊరట కలిగించే విధంగా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్, సైబరాబాద్ 58 కేసుల్లో 406 రిఫండ్ ఆర్డర్లను సాధించిందని డీసీపీ తెలిపారు. వీటి ద్వారా మొత్తం రూ. 1,04,17,082/- రూపాయలను బాధితులకు తిరిగి చెల్లించనున్నట్లు చెప్పారు. ఇది సైబర్ నేరాలపై కఠిన చర్యలతో పాటు బాధితుల ఆర్థిక పరిరక్షణకు పోలీస్ శాఖ ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ



దర్యాప్తులో కీలకంగా వెలుగులోకి వచ్చిన కేసుల్లో ఒకటిగా రూ22.80 లక్షల జాబ్ ఫ్రాడ్ కేసు ఉందని డీసీపీ వివరించారు. ఈ కేసులో నిందితులు ఒక ప్రముఖ ఎంఎన్‌సీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి బాధితుడి నుంచి రూ 20,80,007/- తీసుకున్నారని తెలిపారు. నిందితుడు జాబ్ పోర్టల్ ఉద్యోగిలాగా నటిస్తూ దరఖాస్తు, ఇంటర్వ్యూ, ప్రాసెసింగ్ ఛార్జీల పేరుతో డబ్బు వసూలు చేశారని, డబ్బు తీసుకున్న తర్వాత అపాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వకుండా, రీఫండ్ కూడా చేయకుండా పూర్తిగా స్పందించడం మానేశారని వివరించారు. ఈ కేసులో ప్రధాన నిర్వాహకుడైన పురుషోత్తం శర్మతో పాటు, కమిషన్ ఆధారంగా సిమ్ కార్డులు మరియు బ్యాంకు ఖాతాలు సరఫరా చేసిన కుల్దీప్ కుమార్ సునీల్ అనే ఇద్దరు ఢిల్లీకి చెందిన నిందితులను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నిందితులు మోసపోయిన మొత్తాన్ని అనేక బ్యాంకు ఖాతాల కు మళ్లించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ప్రజలు ఉద్యోగాలు, పెట్టుబడుల పేరుతో సోషల్ మీడియా లేదా జాబ్ పోర్టల్స్ ద్వారా వచ్చే ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీసీపీ టి. సాయి మనోహర్ సూచించారు. ఉద్యోగ దరఖాస్తులు, ఇంటర్వ్యూలు లేదా అపాయింట్‌మెంట్‌ల కోసం ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బు చెల్లించవద్దని, నిజమైన కంపెనీలు ముందస్తుగా రుసుములు వసూలు చేయవని గుర్తుంచుకోవాలని తెలిపారు. వ్యక్తిగత వివరాలు లేదా చెల్లింపులు చేసే ముందు అధికారిక వెబ్‌సైట్లు లేదా సంబంధిత హెచ్‌ఆర్ విభాగాల ద్వారా ధృవీకరణ చేసుకోవాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని డీసీపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# డిప్రెషన్ కారణంగా విజయశాంతి ఆత్మహత్య

### విచారణలో తేల్చిన పోలీసులు

### యూట్యూబర్ల అసత్య కథనాలపై మండిపడ్డ సోదరుడు



హైదరాబాద్,**,ఫిబ్రవరి 7ప్రజావినికిడి,**
విజయశాంతి రెడ్డి, తన ఇద్దరు పిల్లల ఆత్మహత్య కేసులో అసలు నిజాన్ని బయటపెట్టారు పోలీసులు. డిప్రెషన్ కారణంగానే విజయ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. తల్లి మాటను తూచా తప్పకుండా పాటించే పిల్లలు.. ఆమెతో కలిసి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఒంటరిగా ఉండడం వల్ల ఆమె తీవ్ర ఒత్తిడికి లోనయ్యిందని తేల్చారు. ఆమె ఫోన్ కాల్స్ ఆధారంగా విచారణ చేసి, ఈ నిర్ణయానికి వచ్చారు. తెలంగాణలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ విజయశాంతి రెడ్డి ఆత్మహత్య కేసు స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతోంది. ఈ కేసుపై మృతురాలి సోదరుడు చిరంజీవి రెడ్డి స్పందించారు. యూట్యూబ్ ఛానల్స్ తమ ఇష్టానుసారంగా థంబ్‌నెయిల్స్ పెట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సోదరి మరణానికి తాము కారణం కాదని, కుటుంబ సభ్యులంతా ప్రేమతో ఉండేవారమని ఆయన వివరించారు.మా చెల్లి మరణానికి మేము ఎలా కారణం అవుతాం? మేము.. మా చెల్లి విజయను, వారి పిల్లలను ఎంతో ప్రేమగా చూసుకునే వాళ్లం. అల్లుడు, కోడలు నా చేతుల మీదుగా పెరిగారు. మాకు ఎలాంటి రహస్యాలూ లేవు. నా తల్లికి, నాకు ఏదో రహస్యం తెలుసని ప్రచారం చేయడం సరికాదు' అని ఆయన అన్నారు. తమ కుటుంబంపై తప్పుడు వార్తలు ప్రచురిస్తున్న కొన్ని ఛానల్స్‌పై పరువు నష్టం దావా వేస్తామని చిరంజీవి రెడ్డి హెచ్చరించారు. మమ్మల్ని మానసికంగా బాధపెట్టే విధంగా వార్తలు ప్రసారం చేస్తున్నాయని, ఇలాంటి ఛానల్స్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.మాజానికి మేలుచేసే వార్తలు ఎన్నో ఉన్నాయని, అలాంటి వాటిని ప్రచురించాలని విజయశాంతి రెడ్డి సోదరుడు సూచించారు. బాధలో ఉన్న తామూ భాదితులమేనన్నారు. ఒక ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇవ్వకపోవడంతో కక్షపూరితంగా తప్పుడు థంబ్‌నెయిల్స్‌తో వార్తలు ప్రచురిస్తున్నారని ఆయన ఆరోపించారు. పోలీస్ విచారణకు తాము పూర్తిగా సహకరిస్తున్నామని, పోలీసులు ఈ కేసుపై లోతైన దర్యాప్తు చేస్తున్నారని చిరంజీవి రెడ్డి తెలిపారు.

## జాతర ముగింపు.. టన్నుల కొద్దీ చెత్త, జంతు వ్యర్థాలతో...

# మురికికూపంలా మేడారం

**మేడారం మహాజాతర ముగింపుతో భారీగా పేరుకుపోయిన వ్యర్థాలు**

**సుమారు 3 వేల టన్నుల చెత్త పోగైనట్లు అధికారుల అంచనా**

**శుభ్రం చేసేందుకు రంగంలోకి దిగిన 6 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు**

**జంతు వ్యర్థాలు చూసి వాంతులొస్తున్నాయని కార్మికుల ఆవేదన**

**వ్యర్థాల్లో 48 శాతం ప్లాస్టిక్, గాజు సీసాలు ఉండటంపై ఆందోళన**

**,ఫిబ్రవరి 7ప్రజావినికిడి,**
ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర వైభవంగా ముగిసింది. అయితే, కోట్లాదిగా తరలివచ్చిన భక్తులు వెనుదిరిగిన అనంతరం మేడారం పరిసరాలు టన్నుల కొద్దీ చెత్తతో నిండిపోయాయి. ఈ వ్యర్థాలను తొలగించడం ఇప్పుడు అధికార యంత్రాంగానికి, పారిశుద్ధ్య సిబ్బందికి పెను సవాల్‌గా మారింది.మేడారంతో పాటు కన్నెపల్లి, నార్లాపూర్, కొంగల గట్టు వంటి ప్రాంతాల్లో దాదాపు 3 వేల టన్నుల చెత్త పేరుకుపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా జంతు, కోళ్ల వ్యర్థాలు కుళ్లిపోవడంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఈ నేపథ్యంలో సుమారు 6 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు యుద్ధప్రాతిపదికన శుభ్రతా కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు.అయితే, ఈ





పనుల్లో పాల్గొంటున్న కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "రోడ్లు, ప్లాస్టిక్ క్లీనింగ్ అని చెప్పి ఇక్కడికి తీసుకొచ్చారు. కానీ ఇక్కడ జంతువుల తోళ్లు, తలకాయలు, కోళ్ల వ్యర్థాలు గుట్టలుగా పడి ఉన్నాయి. వాటిని చూస్తుంటేనే వాంతులు వస్తున్నాయి. ఇంత గలీజు పని మేమెప్పుడూ చేయలేదు" అని కొందరు కార్మికులు వాపోయారు. అమ్మవార్ల దయతోనే ఈ పని చేస్తున్నాం అని వారు కన్నీటిపర్యంతమయ్యారు. జాతరలో పోగైన వ్యర్థాల్లో దాదాపు 48 శాతం ప్లాస్టిక్, గాజు సీసాల వంటివి ఉండటం ఆందోళన కలిగిస్తోంది. సుమారు 100 టన్నుల ఖాళీ బాటిళ్లలో చాలా వరకు పగిలిపోయి ప్రమాదకరంగా మారాయి. మిగిలిన 52 శాతం బియ్యం, బెల్లం వంటివి భూమిలో కలిసిపోయేవిగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ వ్యర్థాలను వేరు చేసి, మేడారం ప్రాంగణాన్ని శుభ్రపరిచే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# టీమిండియా శుభారంభం.

## టీ20 ప్రపంచ కప్ 2026:. యూఎస్ఏపై ఘన విజయం




ఓ వైపు వికెట్లు పడుతున్నా.. సూర్య(84లి) మాత్రం చెలరేగి ఆడాడు. భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. 77 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ టీమిండియా 100 పరుగులైనా చేస్తుందా? అన్న సందేహాలు ఏర్పడ్డాయి. ఒకే ఓవర్‌లో తిలక్ వర్మ, శివం దూబె, ఇషాన్ కిషన్‌లను ఔట్ చేసిన షాక్‌విక్.. టీమిండియాకు షాకిచ్చాడు. బ్యాటర్లలో సూర్యకుమార్(84లి) టాప్ స్కోరర్. ఇషాన్ కిషన్(20), తిలక్ వర్మ(25) పర్వాలేదనిపించారు. అభిషేక్ శర్మ(0), శివమ్ దూబె(0), రింకూ సింగ్(6), హార్దిక్ పాండ్య(5), అక్షర్ పటేల్(14), అర్ష్‌దీప్ సింగ్(4) వరుణ్ చక్రవర్తి(0) తీవ్రంగా విఫలమయ్యారు. అమెరికా బౌలర్లలో వాన్ షాక్‌విక్ 4 వికెట్లు తీసి ఆశ్చర్యపర్చాడు. హర్మీత్ సింగ్ 2, అలీ ఖాన్, మొహ్సిన్ తలొక వికెట్ పడగొట్టారు. 162 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన యూఎస్ఏ బ్యాటర్లు ఆది నుంచే తడబడ్డారు. మిలింద్(34), సంజయ్(37), శుభం(37) పర్వాలేదనపించారు. ఆంద్రిస్(6), సాయి తేజ(2), మోనాంక్ పటేల్(0), హర్మీత్ సింగ్(0), మొహ్సిన్(8) విఫలమయ్యారు. భారత బౌలర్లలో సిరాజ్ 3, అక్షర్, అర్ష్‌దీప్ తలో రెండు, వరుణ్ ఒక వికెట్ పడగొట్టారు.

# హుస్సాముద్దీన్‌కు కాంస్యమే

లా నూసియా (స్పెయిన్): బాక్సమ్ ఎలీట్ ఇంటర్నేషనల్ టోర్నీలో తెలుగు బాక్సర్ హుస్సాముద్దీన్ కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. శనివారం జరిగిన 60 కిలోల సెమీఫైనల్లో హుస్సాముద్దీన్ ఓటమిపాలయ్యాడు. అలాగే ప్రాంజల్ యాదవ్ (65కి.), కాజల్ (65కి.), సనమాచా చాను (75కి.), మన్‌కీరత్ కౌర్ (80+కి.), జాదుమణి సింగ్ (55కి.), హితేష్ (70కి.) కూడా సెమీఫైనల్లో ఓటమిపాలై కాంస్యాలతో సంతృప్తి పడాల్సివచ్చింది. ఇక.. లవ్లీనా బోర్గోహైన్, సచిన్ ఫైనల్‌కు దూసుకుపోయారు.






# తప్పిదంతోనే గెలిచే మ్యాచ్‌లో ఓడాం

**● నెదర్లాండ్స్ కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్**

చిన్న చిన్న తప్పిదాలే తమ ఓటమిని శాసించాయని నెదర్లండ్స్ కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ అన్నాడు. బ్యాటింగ్‌లో అదనపు పరుగులు చేసినా.. బౌలింగ్‌లో తప్పిదాలు చేయకపోయినా ఫలితం మరోలా ఉండేదని అభిప్రాయపడ్డాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా కొలంబో వేదికగా శనివారం జరిగిన ఆరంభ మ్యాచ్‌లో పాకిస్థాన్ 3 వికెట్ల తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. 148 పరుగుల లక్ష్యఛేదనలో ఓ దశలో 114 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన పాకిస్థాన్ ఓటమి దిశగా సాగింది. కానీ ఫహీమ్ అష్రఫ్(11 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 29 నాటౌట్)అద్భుతమైన బ్యాటింగ్‌తో పాకిస్థాన్‌ను గట్టెక్కించాడు. 19వ ఓవర్ ముందు వరకు విజయం దిశగా సాగిన నెదర్లండ్స్ చివరకు ఓటమికి తల వంచింది. వాన్ బీక్ వేసిన ఈ ఓవర్‌లో ఫహీమ్ ఇచ్చిన సునాయస క్యాచ్‌ను లాంగాఫ్‌లో నెదర్లాండ్ ఫీల్డర్ వదిలేసాడు. ఈ అవకాశంతో చెలరేగిన ఫహీమ్ రెండు మూడు సిక్స్‌లు, ఓ బౌండరీ సాయంతో 24 పరుగులు పిండుకొని పాకిస్థాన్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

# ప్రపంచకప్ గెలవాలంటే ముందు భారత్‌ను ఓడించాలి

**- వెస్టిండీస్ కోచ్ డారెన్ సామీ అభిప్రాయం**



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో విజేతగా నిలవాలంటే ముందు ఆతిథ్య భారత్‌ను ఓడించాలని వెస్టిండీస్ కోచ్ డారెన్ సామీ అభిప్రాయపడ్డాడు. భీకర ఫామ్‌లో ఉన్న టీమిండియాను ఓడించకుండా ఏ జట్టు ప్రపంచకప్ గెలవలేదని అభిప్రాయపడ్డాడు. ప్రస్తుతం అతను చేసిన ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. మెగా టోర్నీలో భారత బలాన్ని తెలియజేస్తున్నాయి. ఒకప్పుడు క్రికెట్‌లో రారాజుగా వెలుగొందిన వెస్టిండీస్ ప్రస్తుతం గడ్డు కాలం ఎదుర్కొంటుంది. తమకు అచ్చొచ్చిన పొట్టి ఫార్మాట్‌లో ప్రపంచకప్ గెలిచి పూర్వ వైభవం అందుకోవాలనే కసితో ఉంది. గతంలో భారత్ వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్ 2016లో వెస్టిండీస్ విజేతగా నిలిచింది. ఆ విజయాన్ని పునరావృతం చేయాలనే లక్ష్యంతో భారత్‌లో అడుగుపెట్టింది. స్కాట్లాండ్‌తో జరిగే తొలి మ్యాచ్‌తో వెస్టిండీస్ తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన డారెన్ సామీ.. భారత జట్టుపై ప్రశంసల జల్లు కురిపించాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 గెలవాలనుకునే ఏ జట్టు అయినా ముందుగా భారత్‌ను ఓడించాలి. భారత్‌ను ఓడించకుండా ఏ జట్టు కూడా టైటిల్ గెలవలేదు. అది నాకౌట్ రౌండ్ కావచ్చు. సెమీఫైనల్ లేదా ఫైనల్ కావచ్చు. సొంత గడ్డపై భారత్‌ను ఓడించడం అంత సులువు కాదు. వారు ఫియర్‌లెస్ క్రికెట్ ఆడుతున్నారు. రాక్షసంగా కనిపిస్తున్న భారత జట్టును ఎదుర్కోవడం ప్రతీ జట్టుకు కష్టమవుతుంది. సరిగ్గా పదేళ్ల క్రితం 2016 టీ20 ప్రపంచకప్‌లో ముంబై వేదికగా జరిగిన సెమీఫైనల్‌కు ముందు నేను మీడియా సమావేశంలో ఇదే చెప్పాను. ఆ సమయంలో మేం గెలుస్తామంటే ఎవరూ నమ్మలేదు. కానీ ఆ రోజు మేం 193 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి భారత్‌ను ఓడించాం. ఆ తర్వాత ఫైనల్లో విజయం సాధించాం. ఇప్పుడు కూడా భారత్‌ను ఓడిస్తేనే టైటిల్ దక్కుతుంది. ఇటీవల సౌతాఫ్రికాతో పరాజయం ఎదురైనప్పటికీ మా జట్టుపై పూర్తి నమ్మకం ఉంది.

# యువ భారత్‌పై భారీ నజరానా

2026 అండర్ 19 వరల్డ్‌కప్ ఛాంపియన్‌గా నిలిచిన యువ భారత్‌కు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. టోర్నీ విజేత టీమ్‌ఇండియాకు రూ.7.5 కోట్ల భారీ ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు ప్రకటన చేసింది. ఈ మేరకు బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా వెల్లడించారు. ఈ టోర్నీలో యువ భారత్ అద్భుతంగా ఆడిందని, ఒక్క ఓటమి లేకుండా ఛాంపియన్‌గా నిలవడం గొప్ప విషయమని సైకియా అభినందించారు. 'ఈరోజు ఛాంపియన్‌గా నిలిచిన అండర్ 19 జట్టును చూసి బీసీసీఐ మాత్రమే కాదు, యావత్ దేశం గర్వంగా ఉంది. మన కుర్రాళ్లు ఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను మట్టికరిపించడం, టోర్నీ ఆసాంతం ఓటమే లేకుండా టైటిల్ నెగ్గడం నిజంగా మనందరికీ గర్వకారణం. ఈ సందర్భంగా యువ జట్టుకు ప్రోత్సాహకంగా బీసీసీఐ నుంచి రూ.7.5 కోట్ల భారీ ప్రైజ్‌మనీ అందించాలని నిర్ణయించాం' అని సైకియా మీడియాతో వెల్లడించారు. అంతకుముందు అండర్ 19 నెగ్గిన టీమ్‌ఇండియాపై భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. 'క్రికెట్‌తో భారత ప్రతిభ ప్రకాశిస్తోంది. వరల్డ్‌కప్ నెగ్గిన అండర్ 19 జట్టు పట్ల గర్వంగా ఉంది. మన యువ జట్టు టోర్నమెంట్ ఆసాంతం అద్భుతంగా ఆడి, అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శించింది. ఈ విజయం చాలా మంది యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుంది' అని మోదీ ట్వీట్ చేశారు. కాగా, జింబాబ్వే హజారే క్లబ్ వేదికగా శుక్రవారం ఇంగ్లాండ్‌తో జరిగిన హై- వోల్టేజ్ ఫైనల్‌లో భారత్ 100 పరుగులు భారీ తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 9 వికెట్ల నష్టానికి 411 పరుగులు భారీ స్కోర్ చేసింది. వైభవ్ సూర్యవంశీ (175 పరుగులు, 80 బంతుల్లో: 15ఞ4, 15ఞ6) భారీ శతకంతో అదరగొట్టాడు. కెప్టెన్ ఆయుష్ మాత్రే (51 బంతుల్లో 53 పరుగులు) హాఫ్ సెంచరీతో రాణించగా, అభిజ్ఞాన్ కుందు (40 పరుగులు, 31 బంతుల్లో) చేశాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో జేమ్స్ మింటో 3, మోర్గాన్ 2, అలెక్స్ గ్రీన్ 2, మానీ ఒక వికెట్ తీశారు. ఛేదనలో ఇంగ్లాండ్ 40.2 ఓవర్లో 311 పరుగులకే ఆలౌటైంది. ఇంగ్లాండ్ బ్యాటర్ కాలేబ్ ఫాల్క్‌నర్ (115 పరుగులు) సెంచరీ వృథా అయ్యింది. భారత బౌలర్లలో దీపేశ్ దేవేంద్రన్, కనిష్క్ చౌహాన్ కీలక వికెట్లు తీసి ఇంగ్లాండ్ పతనాన్ని శాసించారు. ఆర్ఎస్ అంబరీష్, కెప్టెన్ ఆయుష్ మాత్రే కూడా కీలక సమయాల్లో వికెట్లు పడగొట్టారు. అండర్-19 ప్రపంచ కప్‌లో ఛాంపియన్ నిలవడం భారత్‌కు ఇది ఆరోసారి. ఈ టోర్నీని అత్యధిక సార్లు నెగ్గిన జట్టుగానూ భారత్ టాప్‌లో ఉంది.

# పోరాడి ఓడిన నెదర్లాండ్స్..

**- ఉత్కంఠ పోరులో పాక్ విజయం !**

టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా కొలంబోలో నెదర్లాండ్స్‌తో జరిగిన గ్రూప్ స్టేజీ మ్యాచ్‌లో పాకిస్థాన్ విజయం సాధించింది. నెదర్లాండ్స్ నిర్దేశించిన 148 పరుగుల లక్ష్యాన్ని 7 వికెట్లు కోల్పోయి మరో మూడు బంతులు మిగిలి ఉండగానే ఛేదించేసింది. చివరి రెండో ఓవర్లో 29 పరుగుల చేయాల్సి ఉండగా.. ఫహీమ్ అష్రఫ్ (23; 3 సిక్సులు, 2 ఫోర్లు) అద్భుతంగా బ్యాటింగ్ చేసి జట్టును గెలిపించాడు. దాదాపు మ్యాచ్ చేజారిపోయిందని అనుకున్న సమయంలో ఫహీమ్ జట్టును కాపాడాడు. ఓపెనర్లు ఫర్హాన్ (47; 2 సిక్సులు, 4 ఫోర్లు), సెయిమ్ ఆయూబ్ (24; 4 ఫోర్లు, 1 సిక్స్) మినహా మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. అలీ అఘా (12), బాబర్ ఆజమ్ (15), ఉస్మాన్ ఖాన్ (0), షదాబ్ ఖాన్ (8), మహమ్మద్ నవాజ్ (6).. ఇలా బ్యాటింగ్ లైనప్ అంతా పెవీలియన్ కు క్యూ కట్టారు.




# పాక్ జట్టుపై దారుణంగా ట్రోలింగ్



ప్రపంచంలోని 14వ ర్యాంక్ జట్టు నెదర్లాండ్స్ మాజీ ఛాంపియన్ పాకిస్తాన్‌ను దాదాపు ఓడించినంత పని చేసింది. 2026 ఞ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లో పాకిస్తాన్ చివరి ఓవర్లలో అతికష్టమ్మీద నెగ్గింది. ఫహీమ్ అష్రఫ్ 19వ ఓవర్లో 24 పరుగులు సాధించడంతో పాక్ పరువు నిలిచింది. పాకిస్తాన్ జట్టు పొట్టి ప్రపంచ కప్ తొలి మ్యాచులో ర్యాంకింగ్‌లో చాలా కింద ఉన్న నెదర్లాండ్స్‌తో అతికష్టం మీద నెగ్గడంపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరుగుతోంది. బాబర్ ఆజం ఫ్లాప్ షో, పాక్ కెప్టెన్ సల్మాన్ ఆగా కూడా రాణించలేదు. ఫహీమ్ అష్రఫ్ చివర్లో రాణించకపోతే అంతర్జాతీయ వేదిక మీద ఎక్స్‌ట్రాలు చేసిన పాక్ పరువు పోయేదే. అష్రఫ్ చివరి ఓవర్లలో 11 బంతుల్లో 29 పరుగులు చేయడంతో నెదర్లాండ్స్ మీద పాక్ విజయం సాధించింది. ఒక సోషల్ మీడియా యూజర్ ఇలా పోస్ట్ చేశాడు. పాకిస్తాన్ క్రికెట్ జట్టు ఎందుకు టీమ్ ఇండియాతో ఆడదో ఇప్పుడు అర్థమైంది. నెదర్లాండ్స్‌తో ఇలా ఉంటే, భారత్‌తో ఆడితే ఏమవుతుందో అని... పాకిస్తాన్ జట్టును చిన్న జట్టు దాదాపు బట్టలూడదీసినంత పని చేసిందన్నాడు. పాక్ తాజా ప్రదర్శన ఈ ఞ20 ప్రపంచ కప్ నెగ్గడం పాకిస్తాన్ కు అంత తేలిక కాదని స్పష్టం చేసింది.

# జీ5 వేదికగా ఓటిటిలోకి మన శంకరవరప్రసాద్ గారు

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఆ క్షణం రానే వచ్చేసింది. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా విడుదలై బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం ఇప్పుడు డిజిటల్ తెరపై సందడి చేసేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ చిత్ర డిజిటల్ హక్కులను సొంతం చేసుకోగా.. ఈ సినిమాను ఫిబ్రవరి 11నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. దర్శకుడు అనిల్ రావిపూడి మార్కు కామెడీ మరియు ఫ్యామిలీ ఎమోషన్స్‌తో రూపొందిన ఈ చిత్రం, థియేటర్లలో ఏకంగా రూ.375 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఇండస్ట్రీ హిట్లలో ఒకటిగా నిలిచింది. మెగాస్టార్ చిరంజీవి సరసన నయనతార కథానాయికగా నటించగా, విక్టరీ వెంకటేష్ తన స్పెషల్ అప్పీరెన్స్‌తో ప్రేక్షకులను ఫిదా చేశారు. ముఖ్యంగా ఓటీటీలో స్ట్రీమింగ్ అయ్యే వెర్షన్‌లో థియేటర్లో కట్ చేసిన కొన్ని చిరంజీవి, ÷ఎ గణెలిష్ కాంబినేషన్ కామెడీ సీన్లను కూడా జత చేయబోతుండటం విశేషం.





## సిద్ధూ జొన్నలగడ్డ కొత్త చిత్రం
### డైరెక్టర్ ఆర్ఎస్‌జెతో మూవీ



టాలీవుడ్ స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ కొత్త సినిమాను ప్రారంభించాడు. శనివారం ఫిబ్రవరి7 ఆయన పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందింది. ప్రస్తుతం సరైన హిట్లు లేక సతమవుతున్న సిద్ధు తన తదుపరి చిత్రాన్ని దర్శకుడు స్వరూప్ ఆర్ఎస్‌జే (ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ ఫేమ్) తో చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం 'ప్రొడక్షన్ నెం. 40'గా పిలుస్తున్న ఈ సినిమాకు సంబంధించి త్వరలోనే మరిన్ని వివరాలను చిత్రబృందం వెల్లడించనుంది. సిద్ధు తనదైన శైలిలో మరోసారి వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతున్నారని ఈసారి బాక్సాఫీస్ వద్ద బ్లాస్ట్ ఖాయమని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తూ సిద్ధుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. సితార బ్యానర్‌లో సిద్ధుకి ఇది హ్యాట్రిక్ సినిమా కావడం విశేషం


## హైదరాబాద్‌లో దోమల బాధ
### సెటైరికల్‌గా కార్తికేయ వీడియో విడుదల



హైదరాబాద్ నగరంలో దోమల ఉధృతి ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు అందరూ ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. అయితే ఈ విషయంపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకపోవడంతో ఇదే విషయాన్ని సెటైరికల్‌గా తెలియజేశాడు రాజమౌళి తనయుడు ఎస్-ఎస్ కార్తికేయ. ప్రస్తుతం కార్తికేయ ఒక సినిమా షూటింగ్ పనుల్లో బిజీగా ఉన్నారు. అర్ధరాత్రి జరుగుతున్న ఈ షూటింగ్‌లో దోమలు విపరీతంగా ఉండటంతో యూనిట్ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను వ్యంగ్యంగా చూపిస్తూ కార్తికేయ ఒక వీడియోను చిత్రీకరించారు. షూటింగ్ లైట్ల వెలుతురులో దోమలు గుంపులు గుంపులుగా తిరుగుతున్న దృశ్యాలను ఆయన కెమెరాలో బంధించారు. 'హైదరాబాద్ దోమలు మామూలుగా లేవు.. షూటింగ్ చేయడం కూడా కష్టమైపోతోంది' అనే అర్థం వచ్చేలా ఆయన చేసిన ఈ వీడియో చూసి నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. రాజమౌళి గారి సినిమాలో గ్రాఫిక్స్ లాగా ఈ దోమలు ఏంటి ఇంత భయంకరంగా ఉన్నాయి?' అంటూ కొందరు కామెంట్స్ చేస్తుంటే.. మరికొందరు హైదరాబాద్ మున్సిపల్ అధికారులను, ప్రభుత్వాని ట్యాగ్ చేస్తున్నారు. కార్తికేయ పోస్ట్ చేసిన ఈ వీడియో గంటల వ్యవధిలోనే వైరల్‌గా మారింది.

## పెళ్లి తరువాత సామ్‌లో కొత్త కళ

కెరీర్ పరంగా కొంత విరామం తీసుకున్న సమంత మళ్లీ తనదైన మార్కు సినిమాలతో ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీ అవుతోంది. తాను నిర్మించిన థ్రిల్లర్ ఎంటర్‌టైనర్ -శుభం-లో గెస్ట్ క్యారెక్టర్ చేసిన సామ్ త్వరలో పూర్తి స్థాయి క్యారెక్టర్‌తో యాక్షన్ మోడ్‌లో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతోంది. ఆమె నటిస్తున్న భారీ యాక్షన్ ఫ్యామిలీ డ్రామా -మా ఇంటి బంగారం-. నందిని రెడ్డి డైరెక్టర్. సామ్ తన సొంత బ్యానర్ ట్రాలాలా మూవీంగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సమంత నిర్మిస్తున్న రెండవ సినిమా ఇది.



నందినిరెడ్డి డైరెక్టర్ అయినా సామ్ భర్త రాజ్ నిడిమోర్ క్రియేటర్‌గా వ్యవహరిస్తున్నారు. గత నెల విడుదల చేసిన ఈ మూవీ టీజర్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కీలక పాత్రలో నటిస్తున్న ఈ మూవీని 1980వ దశకం నేపథ్యంలో క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఇష్టం లేకుండానే ఓ కుటుంబంలోకి ప్రవేశించిన కోడలిని ఆ ఇంటి వారు ఎలా బయటకి వెళ్లగొట్టాలనుకున్నారు? ఇందులో వారు చేసిన ప్రయత్నాలని సామ్ ఎలా తిప్పి కొట్టింది అన్నదే ఈ చిత్ర ప్రధాన కథగా తెలుస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ మూవీని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇదిలా ఉంటే నాగాచైతన్యతో విడాకులు తీసుకుని కొంత కాలం ఆరోగ్య సమస్యలతో సతమతమైన సామ్ ఇటీవల డైరెక్టర్ రాజ్ నిడిమోర్‌ని వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. పెళ్లి తరువాత నుంచి ప్రొఫెషనల్ వర్క్‌లో సామ్‌బిజీగా మారిపోయింది. రాజ్ నిడిమోర్ సహకారంతో -శుభం- మూవీని నిర్మించి సక్సెస్ సాధించిన సమంత అదే జోష్‌తో ఇప్పుడు -మా ఇంటి బంగారం-లో నటిస్తూ నిర్మిస్తోంది.

ఓ పక్క సినిమాల్లో నటిస్తూనే గతంలో సోషల్ మీడియాలో బిజీగా ఉన్నట్టే ఇప్పుడూ అదే పంథాని కొనసాగిస్తూ చాలా చలాకీగా వ్యవహరిస్తోంది. రాజ్‌తో కలిసి క్రిస్మస్ వేడుకలని హ్యాపీగా సెలబ్రేట్ చేసుకున్న


## అవార్డులకు రెండు, మూడు నెలల్లో నంది అవార్డుల వేడుక
### ఏపీ మంత్రి కందుల దుర్గేశ్



సినిమా, టీవీ, నాటకరంగ కళాకారులకు ఇచ్చే నంది అవార్డులపై ఏపీ మంత్రి కందుల దుర్గేశ్ కీలక ప్రకటన చేశారు. నంది అవార్డులకు సీఎం చంద్రబాబు ఆమోదముద్ర వేశారని... త్వరలోనే అవార్డులు ఇస్తామని తెలిపారు. రాజమండ్రిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.2014, 2015, 2016 సంవత్సరాలకు గాను 2017లో నంది అవార్డులను అప్పటి ప్రభుత్వం (టీడీపీ) ఇచ్చిందని... ఆ తర్వాత మళ్లీ ఇవ్వలేదని దుర్గేశ్ తెలిపారు. అప్పటి నిబంధనల ప్రకారమే ఇప్పుడు కూడా అవార్డులు ఇవ్వాలా? లేక మార్పులు ఏమైనా చేయాలా? అనే దానిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నందమూరి బాలకృష్ణ నుంచి ఈ అవార్డులపై సలహాలు తీసుకుంటామని తెలిపారు. రెండు, మూడు నెలల్లో అవార్డుల వేడుక ఉంటుందని వెల్లడించారు. నంది నాటకోత్సవాలను కూడా నిర్వహిస్తామని చెప్పారు.


## జపాన్‌లో ప్రభాస్‌కు సూపర్ క్రేజీ
### అనన్ మ్యాగజైన్ కవర్‌పై ప్రభాస్ ఫోటో

టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ క్రేజ్ రోజు రోజుకీ ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరిస్తోంది. ఇప్పటికే పాన్ ఇండియా స్టార్‌గా గుర్తింపు పొందిన ఆయన, ఇప్పుడు అంతర్జాతీయ వేదికలపైనా తన ముద్రను బలంగా వేస్తున్నారు. తాజాగా జపాన్‌కు చెందిన ప్రముఖ లైఫ్ స్టైల్ మ్యాగజైన్ 'అనన్' కవర్ పేజీపై ప్రభాస్ కనిపించడం అభిమానుల్లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. ఫిబ్రవరి 10న విడుదల కానున్న ఈ మ్యాగజైన్ 2483వ సంచిక బ్యాక్ కవర్‌పై ప్రభాస్ ప్రత్యేకంగా చోటు సంపాదించటం విశేషం. ఈ గౌరవం సాధించిన మొట్టమొదటి భారతీయ నటుడిగా ప్రభాస్ రికార్డు సృష్టించారు. గతంలో 'ఆర్ఆర్ఆర్' సినిమా సంచలన విజయం తర్వాత ఎన్టీఆర్, రామ్ చరణ్ కలిసి ఈ మ్యాగజైన్ కవర్‌పై కనిపించిన విషయం తెలిసిందే. అయితే, ఒక భారతీయ హీరో సోలోగా అనన్ కవర్‌పై మెరవడం మాత్రం ప్రభాస్‌తోనే మొదలైంది. దీంతో ఆయన అంతర్జాతీయ ఫ్యాన్ బేస్ ఎంత బలంగా ఉందో మరోసారి రుజువైంది. ఆయన వ్యక్తిత్వం, స్టైలిష్ లుక్, గంభీరమైన ఆరా ఈ ఫోటోషూట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మ్యాగజైన్ డిజైన్‌లో ప్రభాస్‌కు ఇచ్చిన ప్రాధాన్యం ఆయన గ్లోబల్ ఇమేజ్‌ను ప్రతిబింబిస్తోంది. డిసెంబర్ 2025లో తన సినిమాల ప్రమోషన్ నిమిత్తం ప్రభాస్ టోక్యో పర్యటనకు వెళ్లిన సమయంలో ఈ ఫోటోషూట్ నిర్వహించినట్లు సమాచారం. అప్పటినుంచే జపాన్ మీడియాలో ఆయనపై ప్రత్యేక కథనాలు వెలువడుతుండగా, ఇప్పుడు అనన్ మ్యాగజైన్ కవర్‌తో ఆ ఆసక్తి మరింత పెరిగింది.




## పవన్ అభిమానులకు డబుల్ ధమాకా
### వచ్చేనెలలో ఉస్తాద్ విడుదలతో పాటు కొత్త మూవీకి రెడీ

పవన్ కళ్యాణ్ అభిమానులకు వచ్చే నెల నిజంగానే డబుల్ ట్రీట్ కానుంది. ఒకవైపు ఆయన హీరోగా నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం విడుదలకు సిద్ధమవుతుండగా, మరోవైపు కొత్త సినిమాకు కూడా శ్రీకారం చుట్టబోతున్నారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ సరికొత్త స్టైలిష్ లుక్‌లో కనిపిస్తుండటం అభిమానుల్లో మరింత ఆసక్తి పెంచుతోంది. పవన్ కళ్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా మార్చి 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. అదే నెలలో ఆయన కొత్త ప్రాజెక్ట్ కూడా ప్రారంభం కానుంది. ఉగాది సందర్భంగా మార్చి 19న పవన్ కళ్యాణ్ -సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రానికి పూజా కార్యక్రమాలు జరగనున్నట్లు సమాచారం. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందనున్న ఈ సినిమాకు రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ తొలి వారం నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రాన్ని రామ్ తాళ్లూరి నిర్మించనున్నారని, పాన్ ఇండియా స్థాయిలో భారీ బ్జడెట్‌తో రూపొందించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని టాక్. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ కనిపిస్తున్న స్టైలిష్ లుక్ కూడా ఈ సినిమాకోసమే రెడీ చేసినదేనని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే 'ఓజీ' చిత్రంలో ముంబై గ్యాంగ్‌స్టర్‌గా కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్న పవన్ కళ్యాణ్‌ను అదే తరహా పాత్రల్లో చూడాలని నేటి తరం ప్రేక్షకులు కోరుకుంటున్నారు. ఆ అభిరుచిని దృష్టిలో పెట్టుకుని మరోసారి గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్ కథనే ఎంచుకున్నారని ఫ్యాన్స్ భావిస్తున్నారు. రాబోయే ఈ సినిమా 'ఓజీ' కంటే కూడా ఎక్కువ క్రేజ్ తెచ్చుకుంటుందని అభిమానులు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుద్ సంగీతం అందించే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. నటీనటుల వివరాలు, ముఖ్యంగా విలన్ పాత్రలో ఓ ప్రముఖ హీరో కనిపించే అవకాశం ఉందన్న ప్రచారం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.




Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613